





రాష్ట్ర గతి మార్చిన.. తూర్పుగోదావరి

ఈవీఎంల గోదాము పరిశీలన

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈవీఎం, వీవీపాట్స్ భద్రతకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంవద్ద ఉన్న ఈవీఎం గోదామును కలెక్టర్ షాన్‌మోహన్, రెవెన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్‌శాఖల అధికారులు, జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీపాట్స్ భద్రతకు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, జిల్లా అగ్నిమాపక అధికారి రాజేష్, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ జగన్నాథం పాల్గొన్నారు.

స్టెల్లా నౌక నుంచి రేషన్ బియ్యం అన్‌లోడింగ్ ప్రారంభం

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు స్టెల్లా ఎల్ నౌక నుంచి రేషన్‌బియ్యం అన్‌లోడింగ్ ప్రారంభమైంది. 1320 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అధికారులు బార్జీల్లోకి దించుతున్నారు. బార్జీల ద్వారా కాకినాడ యాంకరేజ్ పోర్టుకు చేర్చి అనంతరం ప్రభుత్వ గోదాముల్లో భద్రపరుస్తారు. ఈప్రక్రియకు మూడురోజులు పట్టే అవకాశం ఉంది. రేషన్‌బియ్యం పూర్తిగా ఒడ్డుకు చేర్చిన తర్వాత పశ్చిమ ఆఫ్రికాకు పంపాల్సిన మరో 12వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎక్కించి నౌక వెళ్లేందుకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు.

మాతా, శిశు మరణాలు నివారించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాతా, శిశు మరణాలను నివారించేందుకు మరింత మెరుగైన వైద్య విధానాలను పాటించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వైద్యాధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో పిండలింగ నిర్ధారణ నిషేధచట్టం అమలు, మాతా, శిశు మరణాల నివారణ అంశాలపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన రెండో త్రైమాసకాలంలో ప్రసూతి సమయంలో జరిగిన ఏడు మాతా మరణాలు, మూడు శిశు మరణాల కు కారణాలను విశ్లేషించి, దురదృష్టకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో నరసింహనాయక్, జీజీహెచ్ హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ నివేదిక

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ నివేదించారు. ఈమేరకు గుంటూరులో కళాశాల విద్యాశాఖ కమిషనర్‌కు విచారణ నివేదికను శుక్రవారం పంపించారు. పీఆర్ కళాశాలలో అక్రమాలపై పలువురు ఫిర్యాదులు చేశారు. దీంతో కళాశాల విద్యాశాఖ రాజమహేంద్రవరం ఆర్‌జేడీ ఆధ్వర్యంలో ఆయనపై విచారణ చేశారు. పరిపాలనలో పలు తప్పిదాలు జరిగినట్లు గుర్తించారు. కళాశాలలో పరీక్షల విభాగంలో సొమ్ములు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వచ్చాయి. క్రీడాపరికరాల కొనుగోళ్లలో, రెండెకరాలస్థలాన్ని ఫుట్‌బాల్‌కోర్టుకు లీజుకు ఇవ్వడంలో అక్రమాలు జరిగినట్లు విమర్శలు వచ్చాయి.

ఏడాదికి 365 రోజులు.. నెలలు గడిచాయి.. వారాలు గడిచాయి.. ఇక రోజులే ఉన్నాయి.. అది కూడా 2024లో మిగిలింది మూడు రోజులే.. అంటే 72 గంటల్లో కొత్త ఏడాదిలో అడుగు పెట్టబోతున్నాం.. మరి 2024 ఏం చేసిందో తెలిస్తే.. ఒళ్లు గగుర్పొడుస్తోంది.. ఎందుకంటే చరిత్రకు సాక్ష్యం నిలిచింది.. ఎన్నో సమాధానంలేని ప్రశ్నలకు సమాధానమైంది.. ?

ఓటు ఏం చేయగలదు.. పచ్చనోటుకు అమ్ముడుపోతోంది.. అదేం చెబితే అదే చేస్తుంది.. పథకాలకు అమ్ముడుపోతోంది.. ఎవరు ఎక్కువ ఇస్తే వారి వైపు ఉంటుంది.. ఇది గత ఎన్నికల ముందు వరకూ ఉన్న అపోహ.. అయితే 2024 మాత్రం ఓటు ఏం చేయగలదో నిరూపించింది.. మరో 30 ఏళ్లు నేనే సీఎం అన్న జగన్‌ను ఎక్కడ కూర్చోపెట్టాలో అక్కడే కూర్చోబెట్టింది.. మాకేంటి అని ఐదేళ్లు విర్రవీగిన నాయకులదీ అదే పరిస్థితి.. ఓటు బలమేంటో చాటిచెప్పింది.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఐదేళ్ల వైసీపీ అరాచకానికి నిలువునా ఓటుతో పాతరేశారు.. జిల్లా రాజకీయ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా కూటమికి మొత్తం 21కి 21 సీట్లు కట్టబెట్టారు. ఒకరకంగా చెప్పాలంటే 2024 ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసింది. రాజకీయ స్థితిగతులను మలుపుతిప్పింది. తూర్పు గోదావరి జిల్లాలో 2024 సరికొత్త రాజకీయ ఉదయానికి నాందిపలికింది. పవన్ గాలిలో.. చంద్రుడి వెలుగులో ఫ్యాన్ తునాతునకలైంది.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

2024.. మరో నాలుగు రోజుల్లో కాలగర్భంలో కలిసిపోబోతోంది.. మరో కొత్త సంఖ్య కాలగమనంలోకి అడుగుపెట్టబోతోంది.. కానీ గతించిపోతున్న 2024 ఏడాది మాత్రం చరిత్రను తిరగరాసింది. ఓటు విలువ చాటి చెప్పింది.మునుపెన్నడూ లేని విధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పెను సంచలనాలకు కేంద్రబిందువుగా మారింది. రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేయడంలో కనివినీ ఎరుగని రీతిలో కీలకపాత్ర పోషించింది. రాష్ట్రంలో ఐదేళ్ల అరాచకానికి నిలువెత్తు పాతరవేసింది. తనదైన తీర్పుతో చారిత్రక సాక్ష్యంగా నిలిచింది.

ఓటు ఊచకోత..

2024 ఏడాది అంతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగానే రాష్ట్ర రాజకీయాలు సాగాయి. ఈ సంవత్సరం ఐదేళ్ల వైసీపీ అరాచక ప్రభుత్వానికి పాతరేసేలా అటు ఓటర్లు, ఇటు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగాయి. ప్రత్యర్థి పార్టీలే కాకుండా ఓట్లేసి గద్దెనెక్కించిన ప్రజలను సైతం వైసీపీ తన అహంకార,అరాచక పాలనతో వేధించడంతో ఓటర్లంతా కసిగా నిశ్శబ్ద యుద్ధం సాగించారు. అటు కూటమి పార్టీలు సైతం విభేదాలకు తావులేకుండా కలిసికట్టుగా ముందుకు సాగి చరిత్ర ఎరుగని భారీ విజయం సాధించాయి. వాస్తవానికి 2024, మేలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది జనవరి నుంచే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకరేపాయి. ఈ ఏడాది జనవరి 26న పవన్ పొత్తులో భాగంగా తొలి జాబితా ప్రకటించారు. రాజానగరం, రాజోలు నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేస్తుందని రాష్ట్రంలోనే తొలి రెండు సీట్లను ప్రకటించి వైసీపీపై రాజకీయ యుద్ధానికి నాంది పలికారు. అదేనెలలో టీడీపీ అధినేత చంద్రబాబు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించారు. ఉమ్మడి జిల్లాలో తునిలో ఏ పార్టీ విజయం సాధిస్తే ఆపార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్‌కు కొనసాగింపు అన్నట్టు జనవరి 10న తుని నుంచి రా..కదలి రా..సభతో చంద్రబాబు తన ఎన్నికల శంఖారావం పూరించారు. జనవరి 23నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి సుడిగాలి పర్యటనలతో ప్రచార స్పీడు పెంచారు. మరోపక్క జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచే పోటీ చేస్తున్నట్టు మార్చి 14న ప్రకటించారు. అప్పటినుంచి రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి జిల్లాపైనే పడింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ సీట్లలో ఒక్కస్థానం కూడా వైసీపీకి రాకుండా చేసే బాధ్యత తనదని పవన్ కల్యాణ్ ప్రకటించడంతో రాజకీయ వేడి మరింత పెరిగింది. మార్చి 16న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్, ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ కాక పెరిగిపోయింది. కూటమిలో ఏప్రిల్ రెండో వారం నాటికి అభ్యర్థుల లెక్క తేల్చేసి ఎన్నికల బరిలోకి దిగాయి. ఒకపక్క టీడీపీ అధినేత చంద్రబాబు.. మరో పక్క జనసేన అధినేత పవన్.. ఇంకోపక్క బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సుడిగాలి పర్యటనలతో హోరెత్తించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూటమి సునామీ స్పీడుతో ఎన్నికల రణక్షేత్రంలో కదిలి జనచైతన్యాన్ని పెంచాయి.

ఫ్యాన్ రెక్కలు ముక్కలు..

ఐదేళ్ల అరాచకంతో విర్రవీగిన వైసీపీ ఈ ఏడాది జనవరి నుంచే జిల్లాలో చేదు జ్ఞాపకాలను మూటగట్టుకుంది. కాకినాడలో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి నుంచి ఈ చివర తునిలో మంత్రి దాడిశెట్టి రాజా, రాజమహేంద్రవరంలో మంత్రి వేణు.. ఇలా ఒకరేంటి ఎవరికివారే ఐదేళ్లు అధికారం మత్తులో జిల్లాను జుర్రేశారు. వీరందరికి తోడు ఎంపీ మిథున్‌రెడ్డి కడప నుంచి వచ్చి జిల్లాపై సాగించిన పెత్తనం, అక్రమాలు,దందాలు, స్కామ్‌లు జిల్లా ప్రజల్లో వైసీపీపై అసహ్యం పుట్టించేలా చేశాయి.అప్పటికే పన్నుల మోత, ఛార్జీల వాత,రీసర్వే పేరుతో భూముల్లో మతలబులు, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌తో ప్రజల ఆస్తులను లూటీచేసే ప్రయత్నాలతో ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత పెంచేసింది.దీంతో కాకినాడలో జనవరి 3న జగన్ పర్యటించిన సమయంలోను ప్రజలెవరూ రాకుండా ఆ పార్టీ ఓటమిని ముందే ఖాయం చేసేశారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత పేరుతో వారిని మార్చి కొత్తవారిని నిలబెట్టినా జనం ఆదరించలేదు. చివరకు పిఠాపురంలో పవన్‌ను ఓడించేందుకు అప్పటికప్పుడు ముద్రగడను పార్టీలోకి చేర్చుకోవడం, కడప నుంచి మిథున్‌రెడ్డి మనుషులను,వందలకోట్ల డబ్బును పంచినా ప్రజల ఛీత్కారం నుంచి వైసీపీ తప్పించుకోలేక పోయింది. చివరకు ముద్ర గడను సొంతకూతురే చీల్చిచెండాడడంతో వైసీపీ మరింత పలుచన అయిపోయింది. చివరకు ఎన్నికల ఫలితాలతో ఫ్యాన్ రెక్కలు ముక్కలు ముక్కలయ్యాయి.అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీకి క్యాడర్ కూడా ముఖం చాటేయడంతో 2024 ఆపార్టీకి పీడకలగా మారినట్లయింది.

ముద్రగడ పద్మనాభరెడ్డిగా.. ముద్రగడ పద్మనాభం

- 2024 ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు జరిగాయి.. ఈ ఎన్నికల్లో ప్రధాన ఆకర్షణ ముద్రగడ పద్మనాభం. ఎన్నికల్లో వైసీపీ గెలవకపోతే పేరు మార్చుకుంటానని శపథం చేశారు. ఈ ఎన్నికలో ఘోరంగా ఓటమి పాలవడంతో ఆయన తన పేరును ముద్రగడ పద్మనాభరెడ్డిగా మార్చుకున్నారు.
- పి.గన్నవరంలో కూటమి అభ్యర్థిగా టీడీపీనుంచి మహాసేన రాజేష్‌ను ప్రకటించారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆయన స్వచ్ఛందంగా టిక్కెట్ వదులుకున్నారు. పోలీస్ విభాగంలో పనిచేసిన గిడ్డి సత్యనారాయణ జనసేన తరపున అనూహ్యంగా ఆ టిక్కెట్ అందుకుని విజయం సాధించారు.
- ఎన్నికల ముందు వరకూ జనసేనలో ఉన్న పితాని బాలకృష్ణ, శెట్టిబత్తుల రాజబాబు, డీఎంఆర్ శేఖర్, టీడీపీలో ఉన్న గొల్లపల్లి సూర్యారావు ఎన్నికల ముందు వైసీపీలో చేరారు.
- మునిసిపల్ కౌన్సిలర్ కుమారుడైన సుభాష్ అనూహ్యంగా రామచంద్రపురం టిక్కెట్ దక్కించుకున్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రి అయ్యారు.
- వైసీపీ ప్రభుత్వంలో రామచంద్రపురం, కొవ్వూరు నుంచి మంత్రులుగా కొనసాగిన చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత వారు పనిచేసిన నియోజకవర్గాల్లో కాకుండా రాజమహేంద్రవరం, గోపాలపురం నియోజకవర్గాల్లో పోటీచేసి ఓటమి పాలయ్యారు.

- మార్పు తెచ్చిన 'తూర్పు'తీర్పు
- 2024లో రాజకీయ సంచలనం
- కూటమికి మద్దతుగా ఓటర్లు
- అన్ని స్థానాల్లో క్లీన్‌స్వీప్
- 21 స్థానాల్లోను అఖండ విజయం
- వైసీపీకి వాతపెట్టిన జనం
- పిఠాపురం నుంచి బరిలో పవన్
- రాజమండ్రి నుంచి పురందేశ్వరి
- రాష్ట్రవ్యాప్తంగా మార్మోగిన జిల్లా
- చంద్రబాబు.. మోదీ ప్రచారం
- ఓటు సంవత్సరంగా 2024



అరాచకాన్ని అదిమిపట్టి.. ఓటుతో తొక్కేశారు!

మే 14న అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా అప్పటికే కూటమికి అధికారం కట్టబెట్టడానికి సిద్ధపడ్డ ఓటర్లు కనివినీ ఎరుగని రీతిలో పోలింగ్ బూత్‌లకు పోటెత్తారు.పోలింగ్ సమయం ముగిసినా సరే కదలకుండా అర్థరాత్రి పన్నెండు దాటినా ఓట్లు వేసి తీరాలనే కసితో బారులు తీరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఓటర్ల పట్టుదల రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేశాయి. జూన్ 4న వెల్లడైన ఫలితాల్లో ఓటర్ల సునామీ తీర్పును కళ్లకు కట్టాయి. ఈ ఫలితాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలతో పాటు రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలోని రెండు సీట్లు కలిపి మొత్తం 21 స్థానాల్లో కూటమి పార్టీ విజయం సాధించింది. అసలు ఒక్కటంటే ఒక్క సీటు కూడా అధికార వైసీపీ గెలవలేదు.ఐదేళ్ల పాటు అధికారాన్ని అడ్డంపెట్టుకుని విర్రవీగి ఉమ్మడి జిల్లాను అన్ని విధాలా లూటీచేసిన వైసీపీ నేతలను ప్రజలు ఈడ్చికొట్టారు. చెంప చెళ్లుమనే తీర్పునిచ్చి పాతాళానికి తొక్కేశారు.కూటమిలో ఒక్కో ఎమ్మెల్యేకు రికార్డుస్థాయి మెజార్టీ కట్టబెట్టారు.

పదవులు వరించెన్

ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరిని అనూహ్యంగా ఉన్నత పదవులు వరించాయి.కొత్తవారికి మంత్రి పదవులు దక్కగా ఆయా పార్టీలకు విధేయులుగా ఉంటూ కూటమి గెలుపునకు కృషి చేసిన వారికి నామినేటెడ్ పోస్టులు లభించాయి. ఉమ్మడి జిల్లా నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం అయ్యారు. పలు కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరిస్తున్నారు. నిడదవోలు నుంచి జనసేన తరపున ఎమ్మెల్యేగా గెలిచిన కందుల దుర్గేశ్ పర్యాటక శాఖ మంత్రి అయ్యారు. రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వాసంశెట్టి సుభాష్ సామాజిక సమీకరణల్లో భాగంగా అనూహ్యంగా మంత్రి పదవి దక్కించుకున్నారు. టీటీడీ బోర్డు మెంబర్లుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన పారిశ్రామికవేత్త అక్కిన మునికోటేశ్వరరావు ఎంపికయ్యారు. కౌడా చైర్మన్‌గా పెద్దాపురం జనసేన ఇన్‌చార్జి తుమ్మలబాబు, రుడా చైర్మన్‌గా బీవీఆర్ చౌదరి, ఆడా చైర్మన్‌గా ఎ.స్వామి నాయుడు, సివిల్ సప్లైస్ చైర్మన్‌గా జనసేన కాకినాడ నగర అధ్యక్షుడు తోట సుధీర్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు ఇంకా చాలామంది నాయకులు ఆయా కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా ఎంపిక య్యారు. తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబులను ప్రభుత్వ విప్‌లుగా నియమించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్‌గా, సీఎం ప్రోగ్రాం కమిటీ చైర్మన్‌గాఉన్న టీడీపీ సీనియర్ నేత పెందుర్తి వెంకటేశ్‌కు కేబినెట్ హోదా కల్పించారు. ఇలా జిల్లాకు చెందిన పలువుర్ని పదవులు వరించాయి.



పవన్

పురందేశ్వరి

దుర్గేష్

సుభాష్

సైబర్ నేరాలపట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి: ఎస్పీ

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



నేర సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నానాటికీ పెరిగిపోతున్న సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉంటూ జిల్లా ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. కాకినాడ పోలీస్ సబ్ డివిజన్, పెద్దాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో శుక్రవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నెలవారీ నేరసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్‌నేరాలపై అన్ని విద్యాసంస్థల్లో, గ్రామాల్లో ఎప్పటికప్పుడు అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే క్రమంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి జిల్లాలో గంజాయి మూలాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మహిళల భద్రత, రక్షణ చర్యల్లో భాగంగా ప్రారంభించిన మహిళా రక్షక్ కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేర సమీక్షలో శాంతిభద్రతలు, హత్యలు, మహిళలపై జరిగే నేరాలు, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై ప్రత్యేక దృష్టిసారించి వాటిని నిరోధించేలా చర్యలు చేపట్టాలన్నారు. రహదారి భద్రత, ప్రమాదాలు తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టిసారించాలని, దొంగతనాలు జరగకుండా అరికట్టేందుకు రాత్రిపూట గస్తీ ముమ్మరం చేసి పటిష్ఠమైన నిఘాను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై నిరంతర నిఘాను ఉంచాలన్నారు. డిజిటల్ అరెస్ట్ అనేది లేనే లేదని ఈ విధంగా ఎవరైనా బెదిరిస్తే 1930 కాల్ చేయాలని దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్(cybercrime.gov.in)లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఎస్‌బీ డీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావ్, టౌన్ సీఐలు, డీసీఆర్‌బీ, డీటీఆర్‌బీ, ఐటీ కోర్ సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రియ చిన్నారుల పండుగ 7

ప్రతి వీధీ.. ఓ చరిత్రే!

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం



రాజమహేంద్రిలో ప్రతిచోటు వెనుకా ఎంతో ఆసక్తి
బ్రిటీషర్లకూ తగు గౌరవం
లిస్టర్, ఇన్నీస్ పేరుతో ప్రాంతాలు

రాజమహేంద్రవరం వెయ్యేళ్ల చరిత్ర కలిగిన నగరం అనడంలో సందేహం లేదు. గోదావరి తీరం శిలామృత్తిక (ఫాసిల్)గా ఏర్పడిందని చరిత్రకారుల అభిప్రాయం. ఇలా మట్టి శిలారూపంలోకి రావాలంటే లక్షల ఏళ్ల కాలం పడుతుంది. అంటే ఈ ప్రాంతానికి అంత వయసు ఉందని అర్థం చేసుకోవచ్చు. అలాంటి ఈ ప్రాంతం ఎన్నో చారిత్రక ఆనవాళ్లకు ఆలవాలం కావడం అతిశయోక్తి కాదు. ఇక్కడ చిన్న పల్లెటూరిగా అంకురించి నేడు వృక్షంగా విస్తరించి ఐదు లక్షల పైబడి జన సంచారంతో రోజురోజుకూ అభివృద్ధిలో దూసుకుపోతూ నగరపాలక సంస్థ స్థాయికి చేరుకొంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ నగరంగా పేరు గడించింది. గోదారమ్మ ఒడ్డున ఆధ్యాత్మిక ధామంగా విలసిల్లుతోంది. ఇక్కడ ప్రతి ప్రాంతం వెనుకా ఓ చరిత్ర దాగి ఉంటుంది. ఈ క్రమంలో కొన్ని బ్రిటీషర్లకూ సముచిత గౌరవాన్ని ఇవ్వడం మన చూడవచ్చు. రాజమహేంద్రిలోని ఐతిహ్యాల్లో కొన్నిటిని 'ఆంధ్రజ్యోతి' మీ ముందుకు తీసుకొస్తోంది.



ఆర్యాపురంలో ఉన్న లిస్టర్ పేట మున్సిపల్ స్కూల్

● లిస్టర్ పేట

ప్రస్తుత ఆర్యాపురమే లిస్టర్‌పేట. 1895లో రాజమహేంద్రవరంలో బ్రిటిషర్ అయిన లిస్టర్ సబ్‌కలెక్టరుగా పనిచేశారు. 130 ఎకరాల ప్రభుత్వ భూములను 3 వీధులతో ప్లాట్లుగా విభజించి పేదలకు నామమాత్రపు ధరకు ఇచ్చారు. వారిలో 90 శాతం పురోహితులు ఉన్నారు. అందువల్ల ఆయన పేరుతో లిస్టర్ పేటగా స్థిరపడింది. ఈ పేట 1897లో మునిసిపాలిటీలో విలీనమైంది. అయితే ఇక్కడ అధికశాతం పురోహితులు ఉండడం వల్ల 'ఆర్యపురం' అని నామకరణం చేసుకున్నారు. అయితే అధికారిక రికార్డుల్లో లిస్టర్ పేటగానే ఉండేది. 1935లో ఇక్కడ సత్యనారాయణస్వామి గుడి కట్టారు. సంఘ సేవకులు, మాజీ మంత్రి ఏబీ నాగేశ్వరరావు ఈ ప్రాంతంలోనే నివాసం ఉండేవారు. చరిత్రకు మౌన సాక్ష్యంగా నిలిచిన లిస్టర్ పేట మునిసిపల్ స్కూలును ఈనాటికీ ఇక్కడ చూడొచ్చు.

● ఇన్నీస్ పేరున...

లిస్టర్‌పేట కంటే ముందే ఇన్నీస్ పేట ఏర్పడింది. 1865 ప్రాంతంలో సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఇన్నీస్ చొరవతో ఇక్కడ నివాస ప్రాంతం వచ్చింది. కుమారి టాకీస్, జూనియర్ కళాశాల, తూర్పువైపున రాజవీధి (మెయిన్ రోడ్) వరకూ ఈ పేట విస్తరించి ఉండేది. ఇక్కడ మొదటిగా ఆంధ్రభీష్మగా పేరుగాంచిన న్యాపతి సుబ్బారావు పంతులు ఇల్లు కట్టుకొన్నారు. 1870లో నాళం వారి సత్రం నిర్మించారు. ఇక్కడ అన్న వితరణ జరిగేది. రాజమండ్రి రైల్వే స్టేషను వైపు నుంచి వస్తుంటే రాజవీధి మొదట్లో ఈ సత్రం ఉండడంతో జనాదరణ ఎక్కువగా ఉండేది. ఇన్నీస్ పేటలోని మొదటి వీధిని వైత్రాం రోడ్డు అని పిలిచేవారు. ఈయన కూడా సబ్ కలెక్టరే కావడం గమనార్హం. తర్వాత మయూరీ టాకీస్ రోడ్డుగా మారింది. 1910 తర్వాత ఇన్నీస్ పేట కాస్త కుచించుకొని రాజవీధి నుంచి ట్రైనింగ్ కళాశాల వరకూ పరిమితమైంది. అప్పట్లో ఇన్నీస్ పేటను ఆనుకొని హుకుంపేట పరిధి ఉండేది. ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం 1907లో ఇన్నీస్‌పేటను ఆనుకొని ఉన్న హుకుంపేటలో వీరేశలింగం పంతులు 6 ఎకరాల భూమిని ఎకరం రూ.1,200 చొప్పున కొనుగోలు చేశారు. శామలా థియేటర్ నిర్మాణం తర్వాత ఈ పేటలోని కొంత భాగం శ్యామలా సెంటర్‌గా పేరు మార్చుకొంది. ఈ ప్రాంతం ఆనాడు లారీల స్టాండులు కావడం వల్ల లారీలతో నిండి ఉండేది. ఇప్పటి టి.నగర్ కూడా ఇన్నీపేట పేటలో భాగమే. 35ఏళ్లపాటు ఈ ప్రాంతంలో త్యాగరాజ ఉత్సవాలు నిరంతరాయంగా జరిగాయి. దీంతో ఈ ప్రాంతానికి పేరు మార్పు చేయాలని గానకళారాధక బుర్రా పాపయ్య శాస్త్రి పట్టుబట్టారట. దీంతో అప్పటి మునిసిపల్ ప్రత్యేక అధికారి ఎ.సుబ్బారావు చొరవ చూపి గోదావరి గట్టు కింద, రాజవీధి, ఇన్నీస్‌పేటలోని కొంత భాగాన్ని కలిపి త్యాగరాజనగర్ (టి.నగర్)గా పేరు పెట్టారు. త్యాగరాజస్వామి పేరుతో ఏర్పడిన మొట్టమొదటి పేట ఇదేనని చెబుతారు. చెన్నైలోని త్యాగరాయనగర్ ఉన్నా.. అది త్యాగరాయశెట్టి అనే వ్యాపారస్తుడి పేరుతో ఏర్పడింది.



కోటిపల్లి బస్టాండ్ సెంటర్, ఇన్నీస్ పేట రోడ్డు

● జామి, రామదాసు, సీతంపేటలు

విశాఖపట్నం జిల్లాలోని జామి ప్రాంతంలో కరువుకాటకాల వల్ల కొందరు చేనేత కార్మికులు ఇక్కడికి వలస వచ్చారు. వారికి మునిసిపాలిటీ ఒక జామతోట ప్రాంతాన్ని కొని ఇళ్ల స్థలాలను ఇచ్చింది. దీనిని జామిపేటగా పిలిచేవారు. కాలక్రమంలో జాంపేటగా పిలుస్తున్నాం. ఇక్కడి గాంధీ విగ్రహాన్ని ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆవిష్కరించారు. ఎడ్ల రామదాసు అనే ఆధ్యాత్మికవేత్త తన కీర్తనల ద్వారా అహింస, నీతి, వేదాంతం, దైవభక్తి వంటి వాటిపై జాగృతం చేసేవారు. ఆయన 1917లో కాలం చేశారు. ఇక్కడ ఆయన సమాధిని ఏర్పాటు చేసి రామదాసు పేటగా పిలుచుకోవడం జరిగింది. ఈ పక్కనే విశ్రాంతిపురం(టీబీ శానిటోరియం)లో క్షయవ్యాధి నివారణ కేంద్రం ఉండేది. ఇక్కడికి వచ్చే రోగుల సంబంధీకులు రామదాసుపేటలో బస చేసేవారు. ఈయన పేరుతో కాకినాడలో కూడా ఒక వీధి ఉంది. కాండ్రేగుల జమిందారు తన తల్లి సీతమ్మ పేరుతో బ్రాహ్మణులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఒక చెరువును కూడా తవ్వించారు. దానిని సీతమ్మ చెరువుగా పిలిచేవారు. ఈ ప్రాంతమే ఇప్పుడు మనం పిలుస్తున్న సీతంపేట.



● ఇదే పాల్ చౌక్

ప్రస్తుతం కోటిపల్లి బస్టాండ్ ఉన్న ప్రాంతమే ఇది. భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో వందేమాతరం ఉద్యమం ఉవ్వెత్తున్న ఎగిసిపడుతున్న రోజులవి. 1907లో ప్రముఖ ఉద్యమకారుడు బిపిన్ చంద్రపాల్ నగరానికి వచ్చారు. ఐదు రోజులపాటు ఉత్తేజితం చేసే ప్రసంగాలు చేశారు. ఆ సమయంలో ప్రసిద్ధ కవి చిలకమర్తి లక్ష్మీ నరసింహరావు.. 'భరత ఖండంబు చక్కని పాడియావు, హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ, తెల్లవారను గడుసరి గొల్లవారు, పితుకుచున్నారు మూతులు బిగియకట్టి' అనే పద్యాన్ని అప్పటికప్పుడు ఆశువుగా రచించి వినిపించారు. ఇది బ్రిటిష్ ప్రభుత్వాన్ని వణికించడంతో కోర్టులో కూడా విచారణ జరిగింది. ఇలా ఆ పద్యం దశదిశలా వ్యాపించింది. దీంతో ఈ ప్రాంతానికి పాల్ చౌక్ అనే పేరు వచ్చింది. బస్టాండ్, లారీ స్టాండ్ (జెట్టీ టవర్స్ ప్రదేశం), అక్కడి 3 పార్కుల విశాల ప్రాంతాన్ని పాల్‌చౌక్‌గా వ్యవహరించేవాళ్లు. ఆనాడు గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ, ప్రకాశం పంతులు, సరోజిని నాయుడు వంటి మహానుభావులు ఎందరో ఇక్కడ ప్రసంగించారు. ఇలాంటి చారిత్రక ప్రదేశాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఈ ప్రాంతంలో ప్రైవేటు భవనాలకు అనుమతులు కూడదని ఆనాటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు ఉత్తర్వులు కూడా ఇచ్చారు.



● సుబ్రహ్మణ్య మైదానం

ఆనం కళా కేంద్రం పక్కన ఉన్న సుబ్రహ్మణ్య మైదానం అందరికీ సుపరిచితమే. పూర్వం ఇది పోలీస్ పెరేడ్ గౌండ్. స్వాతంత్ర్యం సిద్ధించిన రోజున కల్నల్ డీఎస్ రాజు.. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, సీతానగరంలోని గౌతమీ సత్యాగ్రహాశ్రమం వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం పేరున ఈ మైదానాన్ని సుబ్రహ్మణ్య మైదానంగా ప్రకటించారు. రాజమండ్రికి రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా, నేతాజీ అంతరంగిక వైద్యులుగా డీఎస్ రాజు పనిచేశారు. ఒకప్పుడు ఇక్కడ పోలీస్ స్టేషను నిర్మాణానికి జనం ఒప్పుకోలేదు. మధ్యలో గోడ కడతామని చెప్పినా వ్యతిరేకత ఎదురైంది. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ఈ ఆనవాలును కూడా చరిత్రలో కలిపేశారు.

సముద్ర తీర భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి: కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీర భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి తగిన చర్యలు చేపట్టాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాకినాడ జిల్లా స్థాయి కోస్టల్ సెక్యూరిటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ తీర ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. వారం చివరి రోజు, పండుగల సందర్భాల్లో ఎక్కువ సంఖ్యలో ప్రజలు సముద్ర తీరానికి వస్తున్నారన్నారు. మత్స్యకారులు వేట సందర్భాల్లో ఎటువంటి మరణాలు సంభవించకుండా తీర భద్రత సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందిని సమన్వయం చేసుకుని షెడ్యూల్ ప్రకారం పెట్రోలింగ్ చేయాలన్నారు. సముద్ర స్నానాల సమయంలో ప్రజలు సముద్రం లోపలికి ఎక్కువగా వెళ్లకుండా భద్రతా సిబ్బంది పర్య వేక్షణ చేయాలన్నారు. మత్స్యకారులు వేట సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణ మార్పులపై మత్స్యకార ప్రాంతాల్లో అధికారుల బృందాలు నిరంతరంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కాకినాడ ఎన్టీఆర్ బీచ్, సూర్యారావుపేట బీచ్, ఉప్పాడ బీచ్‌ల వద్ద మరింత సమర్థవంతంగా భద్రతా చర్యలు చేపట్టేందుకు వాచ్ టవర్స్ పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, బోట్ల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఏపీ మెరైన్ సెక్యూరిటీ పోలీస్ అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు, ఇండియన్ కోస్ట్‌గార్డ్ సహాయక ఇంజనీర్ ధనుంజయ్, జిల్లా మత్స్య శాఖ అధికారి కరుణాకర్, నేవీ లెఫ్టినెంట్ కమాండర్ ఆవేశ్, వాకలపూడి మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలు, తాబేళ్లను పరిరక్షించాలి

కాకినాడ జిల్లా స్థాయి అటవీ కమిటీ సమావేశంలో కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలలు, సముద్ర తాబేళ్ల పరిరక్షణకు అటవీ, మత్స్య, మెరైన్ పోలీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాకినాడ జిల్లా స్థాయి అటవీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తడి నేలల పరిరక్షణ, నిర్వహణ నియమం-2017 ప్రకారం కాకినాడలో చిత్తడి నేలలను నోటిఫై చేయాలన్నారు. సముద్ర తీర ప్రాంతాలకు ఆనుకుని ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచుకుని ఈ చిత్తడి నేలలో అరుదైన మొక్కలు, పక్షులు, జంతువులు, చేపలు గుడ్లు పెట్టడానికి చాలా అనుకూలంగా ఉంటాయన్నారు. కోరింగ వన్య ప్రాణుల అభయారణ్యంలో ఎకో, సెన్సిటివ్ జోన్ మాస్టర్ ప్లాన్ తయారీకి తిరువనంతపురంలోని పర్యావరణ అభివృద్ధి కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. జలాచర జీవుల్లో ఆలివ్ రిడ్లీ తాబేళ్ల ఎంతో వైవిధ్యంతో కూడుకున్నవన్నారు. వీటి మరణాలను నిరోధించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సముద్ర తాబేళ్ల గుడ్లు పెట్టడానికి ప్రతిఏటా డిసెంబరు నుంచి మే నెల వరకు సముద్ర తీరానికి వస్తూ ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో చేపలు పట్టే వలలు, ట్రాలర్లలో ప్రమాదవశాత్తు చిక్కుకుని మరణాలు సంభవిస్తున్నాయన్నారు. డిసెంబరు నుంచి మే నెల వరకు సముద్ర తాబేళ్ల గూడు కట్టే ప్రదేశాల చుట్టూ ఐదు కిలోమీటర్ల వ్యాసార్థంలో మెకనైజ్డ్ ట్రావెర్ల ద్వారా చేపలు వేటాడకుండా అటవీ, మెరైన్, కోస్ట్‌గార్డు, మత్స్యశాఖల విభాగాలు సముద్రంలో నిరంతరం ఉమ్మడి పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో కాకినాడ జిల్లా అటవీ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి కరుణాకర్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు గణపతి, కాకినాడ, కోరంగి ఫారెస్ట్ రేంజర్లు శ్రీదీప్తి, వరప్రసాద్ పాల్గొన్నారు.

'కడియం నర్సరీలు ప్రయోగశాలలు'



కర్ణాటక రాష్ట్ర ఉద్యానవన శాఖాధికారులకు పుష్పగుచ్ఛాలు ఇస్తున్న స్థానిక నర్సరీల యజమానులు

కడియం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలంలోని నర్సరీలు ప్రయోగశాలలు అని కర్ణాటక రాష్ట్ర ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వనాథశర్మ పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 25 మంది ఉద్యానవన శాఖ అధికారులు శుక్రవారం శ్రీదుర్గా నర్సరీ అధినేత పెద్దిరెడ్డి శ్రీనుతో కలిసి సత్యదేవ, పల్ల వెంకన్న, సత్యనారాయణ, వెంకట శ్రీనివాస, గౌతమి నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. పలు రకాల మొక్కల శాస్త్రీయ నామాలు, వాటి విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు. వివిధ పండ్ల జాతి మొక్కలు, పుష్పాల మొక్కలను తిలకించారు. కడియపులంక అంతర్ రాష్ట్ర పూల మార్కెట్‌ను పరిశీలించి మార్కెట్ విధివిధానాలపై యాజమాన్యాన్ని అడిగారు. మార్గాని సత్యనారాయణ, గంగుమళ్ల సత్యనారాయణ, పల్ల సత్తిబాబు, పుల్లా పెదసత్యనారాయణ, మల్లు పోలరాజు, చిలుకూరి త్రిమూర్తులు, మార్గాని వీరబాబు, దర్మాసనం వెంకటరమణ, పాటంశెట్టి బాబ్జీ, పాటంశెట్టి బూరయ్య మొక్కల విశిష్టతలను వివరించారు.



మన్మోహన్‌సింగ్‌కు నివాళి

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కన్నుమూయడంతో ఆయన పాలనలో చేసిన కృషిని ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకుంటున్నారు. దేశానికి ఎంతో సేవ చేసిన ఆ మహనీయుడిని స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని బండారులంకకు చెందిన ప్రముఖ కార్టూనిస్టు మాడా రాము మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తూ క్యారికేచర్ గీశారు. పలువురు కళాకారులు, చిత్రకారులు మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి/అమలాపురం రూరల్



ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో ఎంఎం పళ్లంరాజు

మన్మోహన్ సింగ్ బ్రిలియంట్ ప్రధాని

ప్రత్తిపాడు/సామర్లకోట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మన్మోహన్‌సింగ్ బ్రిలియంట్ ప్రధాని అని మాజీ కేంద్రమంత్రి ఎంఎం పళ్లంరాజు అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కన్నుమూయడంతో శుక్రవారం ఆయన ఘన నివాళి ప్రకటించారు. ఈ సందర్భంగా పళ్లంరాజు మాట్లాడుతూ దేశాభివృద్ధికి మన్మోహన్ సింగ్ ఎంతో కృషి చేశారని, ఆర్థిక శాఖ మంత్రిగా ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. మానవ వనరుల అభివృద్ధి కోసం యూపీఏ ప్రభుత్వంలో మన్మోహన్‌సింగ్ మంత్రివర్గ సహోద్యోగిగా తనను చేర్చడం ద్వారా ప్రధానిగా ఎంతో విశ్వాసాన్ని ఉంచారని గుర్తుచేసుకున్నారు.



మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌తో మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, జీవీ హర్షకుమార్

ద్రాక్షారామ ప్రజలకు మేలు చేసిన మన్మోహన్ : మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామ గ్రామ ప్రజలకు ఎనలేని మేలు చేశారని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. ద్రాక్షారామ చారిత్రక ప్రాంతం కావడం వల్ల అక్కడ ఒక ఇటుక తీయడానికి, వేయడానికి కూడా అనుమతి లేదని... దీనిపై తాను అమలాపురం ఎంపీగా ఉన్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే పిల్లి సుభాష్‌చంద్రబోసు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఇది పురావస్తు శాఖ పరిధిలో ఉండడం వల్ల కేంద్రస్థాయిలో కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో. తాను స్వయంగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ దృష్టికి తీసుకెళ్లగా... మొదట ఆయన ఆలోచించి తర్వాత అధికారులకు ఆదేశం ఇవ్వడంతో ద్రాక్షారామ నిబంధనలు తొలగించారని, ప్రజలందరికీ మేలు జరిగిందని చెప్పారు.

ఉత్తమ నాయకుడు : ఉండవల్లి

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఉత్తమ నాయకుడు. ఆయన మృతి తీరని లోటు. ఆయనకు ఉత్తమ గతులు ప్రాప్తించుగాక అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ నివాళి అర్పించారు.



ఎస్.యానాంలో మన్మోహన్‌కు నివాళులర్పిస్తున్న వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారిణులు

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కి నివాళిగా

నేటికి వాయిదా పడిన బీచ్ వాలీబాల్ పోటీలు

ఉప్పలగుప్తం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అస్తమించడంతో ఎస్.యానాంలో శుక్రవారం ప్రారంభం కావలసిన నేషనల్ మహిళా బీచ్ వాలీబాల్ పోటీలను ఒకరోజు వాయిదా వేసినట్టు వాలీబాల్ అసోసియేషన్ ప్రకటించింది. శని, ఆదివారాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నట్టు వివరించారు. శుక్రవారం ఎస్.యానాం బీచ్‌లో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ల పద్మనాభం అధ్యక్షతన సంతాప సమావేశం నిర్వహించారు. ఎనిమిది రాష్ట్రాల నుంచి ఎంతో వ్యయప్రయాసలకోర్చి క్రీడాకారిణులు వచ్చారన్నారు. ఈ కారణంగా పోటీలను కొనసాగించక తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడి స్వామినాయుడు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లంకే భీమరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, వాటర్ డీసీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, కూటమి నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పినిశెట్టి నరసింహారావు, సత్తి చిన్నా, రవణం మధు, టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్, రంకిరెడ్డి కాశీ, వుండ్రు వెంకట మునలయ్య, రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, వివిధ రాష్ట్రాల క్రీడాకారిణులు పాల్గొన్నారు.

విద్యార్థుల పెన్సిల్ చిత్రాల్లో మన మాజీ ప్రధాని



విద్యార్థులు గీసిన మన్మోహన్‌సింగ్ పెన్సిల్ చిత్రాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ స్కూలుకు చెందిన విద్యార్థులు గీసిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈదరాడ హైస్కూలులో పదో తరగతి చదువుతున్న డి.అలేఖ్యస్ఫూర్తి, యెరుబండి నాగమణికార్తిణి పెన్సిల్‌తో ఈ చిత్రాలను గీశారు. అచ్చుగుద్దినట్టు మన్మోహన్‌సింగ్ చిత్రాలు గీసిన విద్యార్థినులను హెచ్ఎం సాయిబాబు, డ్రాయింగ్ మాస్టారు బత్తుల శ్రీనివాస్ అభినందించారు.

- మామిడికుదురు

ప్రజల పక్షాన సీపీఐ

31 వరకూ సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవ సభలు

రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాల తరపున పోరాటం సాగిస్తామని ఆయన వెల్లడించారు. సీపీఐ శత వసంతాల సందర్భంగా శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సుబ్రహ్మణ్యమైదానంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. వందేళ్ల భారత దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటామని, దాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 31వ తేదీ వరకూ సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవ సభలు జరుగుతాయని తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ ప్రముఖ పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, నగర కార్యదర్శి కొండలరావు, జట్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, జిల్లా కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.



సభకు హాజరైన కార్మికులు

వైసీపీ హయాంలో సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి

రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి



శివకోడులో జరిగిన సభలో మాట్లాడుతున్న శ్రీదేవి

రాజోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.40వేల కోట్లు పక్కదారి పట్టాయని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి ఆరోపించారు. చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి తొలిసారి జిల్లాకు విచ్చేసిన ఆమెకు ఎన్డీఏ నాయకులు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడులో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. శివకోడులో శ్రీమంగెన గంగయ్య తెలగా కల్యాణ మండపంలో జరిగిన సభలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ, ఎస్టీలకు ఎస్సీ కార్పొరేషన్, విదేశీ విద్య వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ కార్పొరేషన్‌లు ఇచ్చిన దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. జగన్ పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, వైసీపీ విద్యుత్ చార్జీలపై ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ప్రస్తుతం అమలవుతున్న ఉన్నతి పథకాలు, త్వరలో అమలయ్యే ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక, ఇ-ఆటోలు, షాపింగ్ కాంప్లెక్సులు, పౌల్ట్రీ కాంప్లెక్సులు, ఎన్ఎస్ఎఫ్ డీసీ, ఎన్ఎస్కే ఎఫ్‌డీసీ రికవరీలపై సమీక్ష చేపట్టారు. నిరుపేదలైన ఎస్సీ లబ్ధిదారులకు ఉపాధి కల్పించేందుకు మెరుగైన సేవలు అందించడం ద్వారా పథకాలు అమలు చేయడంలో చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉన్నతి పథకం ద్వారా కాకినాడ జిల్లాలో 67 మందికి 69.50లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలో 74 మందికి రూ.92.50లక్షలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 89 మందికి రూ.76.50లక్షలతో ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. శ్రీదేవి దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మెస్పీ అధికార ప్రతినిధి ఎన్.సత్యనారాయణ, శెట్టెం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎస్సీ డైరెక్టర్లు వల్లూరి రాజా, ఎం.చంద్రశేఖర్, జె.సత్యవతి,కార్పొరేషన్ సిబ్బంది తదితరులున్నారు.

కొల్లూరికి తెలుగు రచయితల మహాసభల ఆహ్వానం



కొల్లూరి

అమలాపురం టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈనెల28, 29తేదీల్లో విజయవాడ కేబీఎన్ కళాశాలలో జరిగే ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో పాల్గొనేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ప్రముఖ కవి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరికి ఆహ్వానం అందింది. 28న పద్మశ్రీ ఆశావాది ప్రకాశరావు సభావేదికపై జరిగే మొదటి కవి సమ్మేళనంలో కొల్లూరి పాల్గొంటారు. గతంలో విజయవాడలో జరిగిన 3, 4, 5 ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో కొల్లూరి పాల్గొనడం విశేషం.

4 నుంచి అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

అమలాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 2025 ఫిబ్రవరి 4 నుంచి 13 వరకు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా జనవరి 2న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 7న శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం, 8న రథోత్సవం, 12న స్వామివారి చక్రస్నానం, 13న తెప్పోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆమె పేర్కొన్నారు.

వాహనాలు ఢీకొని యువకుడి మృతి





శంఖవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడి-నెల్లిపూడి రహదారిలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ప్రత్తిపాడు మండలం వాకపల్లి గ్రామానికి చెందిన మురుకుర్తి అప్పన్న (30) తన అన్న భార్య మురుకుర్తి రాణిని తీసుకుని బ్యాంకు పనిపై కత్తిపూడి వచ్చాడు. తిరిగి వెళ్తుండగా కత్తిపూడి శివార్లలో ఎదురుగా ఎదురుగా వస్తున్న వాహనం, వీరి వాహనం పరస్పరం ఢీకొన్నాయి. రాణి, అప్పన్నలను స్థానికుల సాయంతో కాకినాడలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పన్న చికిత్స పొందుతూ మృతి చెందాడు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు అప్పన్న (ఫైల్‌ఫొటో)

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



తుని రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం... శుక్రవారం ఉదయం 7.30గంటల సమయంలో తుని ఉల్లిపాడు రైల్వేస్టేషన్ మధ్య సుమారు 35 నుంచి 40 ఏళ్ల కలిగిన వ్యక్తి రైలు నుంచి జారిపడినట్టు గుర్తించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. తెలుపు రంగు ఛాయ కలిగి 5.5అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడని, సంబంధీకులు ఎవరైనా తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో కానీ, 9490619020 నెంబర్లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

జారిపడిన వ్యక్తి మృతదేహం

ఆత్మహత్యాయత్నానికి నిర్ణయించుకున్న

వివాహితను అడ్డుకున్న హెచ్‌సీ



వివాహితను భర్తకు అప్పగిస్తున్న హెచ్‌సీ

అన్నవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం రైల్వే స్టేషన్‌లో పిల్లలతో ఆత్మహత్యాయత్నానికి నిర్ణయించుకున్న వివాహితపై అన్నవరం జీఆర్పీ హెచ్‌సీ శ్యామ్‌కు అనుమానం వచ్చి విచారించడంతో భర్తకు విషయం తెలియపరిచి ఆయనకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.... నక్కపల్లి మండలం నామవరానికి చెందిన కిల్లాడ లోవలక్ష్మి భర్తతో గొడవపడి ఒంటరిగా జీవిస్తోంది. పిల్లలను భర్తకు అప్పగించి ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకుంది. భర్త పిల్లల్ని తీసుకోకపోవడంతో అన్నవరం రైల్వేస్టేషన్ వద్ద అనుమానంగా తిరుగుతోంది. ఆమె గురించి అక్కడ విధుల్లో ఉన్న జీఆర్పీ కానిస్టేబుల్ శ్యామ్ తుని రైల్వే ఎస్ఐకు సమాచారమిచ్చారు. భర్తను రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చి భార్య పిల్లల్ని అతడికి అప్పగించారు. శ్యామ్‌ను అక్కడి ప్రయాణికులు అభినందించారు.

రూ.16వేలు జరిమానా చెల్లించలేనన్న వ్యక్తికి

ఆరునెలల 15రోజుల జైలుశిక్ష

ఆలమూరు కోర్టులో న్యాయమూర్తి సంచలన తీర్పు

ఆలమూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి సాధారణంగా జరిమానా వేస్తారు. అయితే ఆ జరిమానా చెల్లించలేనని చెప్పడంతో ఓ వ్యక్తికి ఆరు నెలల 15రోజుల జైలు శిక్ష విధిస్తూ ఆలమూరు కోర్టులో శుక్రవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన కేవీ.వరప్రసాద్ మద్యం తాగి వాహనం నడుపుతుండగా అక్టోబరు 26న ఆలమూరు పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. అయితే అతడు అప్పటి నుంచి కోర్టుకు హాజరు కాకపోకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. శుక్రవారం వరప్రసాద్‌ను పట్టుకుని ఆలమూరు కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ ఎదుట హాజరుపరిచారు. దీంతో రూ.16వేలు జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పారు. ఈ తీర్పుపై వరప్రసాద్ మాట్లాడుతూ.. అంతమొత్తం నేను చెల్లించలేనని చెప్పడంతో ఆరునెలల 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సంచలన తీర్పు చెప్పారు.

జియో.. జీరో!

- ఆనవాలు లేకుండా కొట్టుకొనిపోయిన జియోట్యూబ్
- ఉప్పాడ తీరంలో మాయాపట్నం నుంచి కొత్తపట్నం వరకు జాడలేని వైనం
- కెరటాల రాపిడికి గులకరాళ్లుగా మారిన బండరాళ్లు



సూరాడపేటలో జియోట్యూబ్ నిర్మించిన ప్రాంతం



కెరటాల రాపిడికి అరిగిపోయి చిన్న గులకరాళ్లుగా మారిన బండరాళ్లు

కొత్తపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సముద్రకోత నుంచి తీరప్రాంత రక్షణకు నిర్మించిన జియో ట్యూబ్‌టెక్నాలజీ నామరూపాలు లేకుండా సముద్రంలో కలిసిపోయింది. తుఫాన్లు, అల్పపీడనాలకు, పౌర్ణమి, సముద్రంలో ప్రతిరోజూ ఏర్పడే పోటు, పాట్లతో కాకినాడ జిల్లాలోని ఉప్పాడ తీర ప్రాంతం క్రమేపీ కోతకు గురవుతూ వస్తోంది. సముద్రకోత నివారణకు పదేళ్ల కిందట ఉప్పాడ శివారు మాయాపట్నం నుంచి కొత్తపట్నం వరకు కిలోమీటరున్నర పొడవునా జియోట్యూబ్ టెక్నాలజీతో రక్షణగోడ నిర్మించారు. సముద్రకోతకు గురయ్యే మాయాపట్నం నుంచి కొత్తపట్నం వరకు ఒడ్డున మొలలోతు కెనాల్ ఏర్పాటు చేశారు. ఆ కెనాల్ కింద నుంచి ఒడ్డుపై నుంచి ఐదు మీటర్ల ఎత్తులో బండరాళ్లను గాబియాన్ సంచుల్లో నింపి రక్షణ గట్టును నిర్మించారు. దీంతో తుఫాన్ల సమయంలో ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాలు ఒడ్డును నిర్మించిన గాబియాన్ సంచుల్లో బండరాళ్లను ఢీకొని విడిపోవడంతో కెరటం బలం తగ్గడంతో కోత నివారణ సాధ్యమవుతుందన్న కోణంలో జియోట్యూబ్ నిర్మించారు.

కూటమి ప్రభుత్వంపై బాధ్యత

దశాబ్దకాలంపాటు ఎన్నో తుఫాన్‌లను తట్టుకుని నిలబడిన జియోట్యూబ్ ఇటీవల వరుసగా ఏర్పడిన తుఫాన్‌లు, వాయుగుండాలతో నామరూపాలు లేకుండాపోయింది. ఇది పాడవడానికి సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, తీరప్రాంతాలకు చెందిన ఆకతాయిలు జియోట్యూబ్‌పై ఆడుకుంటూ బ్లేడ్‌లతో గాబిసంచులకు కట్టిన నైలాన్ తాళ్లను కట్ చేయడం ప్రధాన కారణం. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కోనపాపపేట నుంచి ఉప్పాడ వరకు జియోట్యూబ్ టెక్నాలజీతో రక్షణ కల్పిస్తామని హామీ ఇవ్వడం విదితమే. రక్షణ చర్యలు చేపట్టడం ప్రభుత్వాల బాధ్యత. అదే బాధ్యత సముద్రకోతనుంచి గ్రామాన్ని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్న టెక్నాలజీని బాధ్యతతో పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని మత్స్యకార పెద్దలు చెబుతున్నారు. జియోట్యూబ్ టెక్నాలజీ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని తీరప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నేటి నుంచి

క్రియ చిన్నారుల పండుగ

జేఎన్‌టీయూకేలో ఏర్పాట్లు, ముఖ్య అతిథిగా డాక్టర్ జయప్రకాశ్ నారాయణ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 11వ రాష్ట్రస్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీల క్రియ పిల్లల పండుగ డిసెంబరు 28 నుంచి 29 వరకు రెండురోజుల పాటు కాకినాడ జేఎన్‌టీయూకేలో నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి చిన్నారుల పండుగ ప్రారంభంకానుంది. ముఖ్య అతిథిగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ హాజరు కానున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఈ పోటీల్లో పాల్గొనేందుకు సుమారు 10వేలు మంది వరకు విద్యార్థులు హాజరుకావచ్చని నిర్వాహకులు తెలిపారు. 2రోజుల పాటు 28 విభాగాల్లో నిర్వహించనున్న చిన్నారుల పండుగలో తొలి రోజు శనివారం చిన్నారులకు నాటికలు, శాస్త్రీయ నృత్యం, కోలాటం, ఏకపాత్రాభినయం, పాటలు, పోస్టర్ ప్రజెంటేషన్, సైన్ ప్రయోగాలు, గ్రూపు డిబేట్, గణితం, క్విజ్, వ్యాసరచన, కథా రచన, విశ్లేషణ, అంతర్జాలంలో అన్వేషణ జరుగుతాయి. ఆదివారం జానపద నృత్యం (బృందం), విచిత్ర వేషధారణ, బుర్ర కథ, కోలాటం, ప్రాజెక్టు పని, వాద్య సంగీతం, మాటలు, కథ చెప్పడం, స్పెల్లింగ్, చిత్రలేఖనం, సృజనాత్మక వస్తువుల తయారీ, మైమ్, మట్టితో బొమ్మలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 5వ తరగతి వరకు సబ్ జూనియర్స్ 6,7 తరగతులు జూనియర్స్ విభాగం.. 8, 9, 10వ తరగతులు సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు.

ఉప్పాడలో బంగారు రజను వేట



ఉప్పాడలో సముద్రం ఒడ్డున బంగారు రజను సేకరిస్తున్న మహిళలు



కొత్తపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస అల్పపీడనాల అనంతరం ఉప్పాడ తీరంలో బంగారు రజను వేట ప్రారంభమైంది. కెరటాలు సాధారణ స్థాయిలో ఒడ్డుకు రావడం, వెనక్కి వెళ్లడం జరుగుతుంది. అల్పపీడనాలతో ఉప్పొంగిన సముద్ర కెరటాలు ఒడ్డును బలంగా తాకేవి. అప్పట్లో కెరటాల వేగానికి ఒడ్డున నిలబడి ఇసుకలో బంగారు రజను సేకరించడం వీలుపడని కారణంగా గత 2 రోజుల నుంచి మత్స్యకార మహిళలు తీరంలో ఒడ్డున బంగారు రజకు కోసం జల్లెడ పట్టారు. దువ్వెనలు, పలుచని బ్లేడ్ వంటి రేకులతో సముద్రం ఒడ్డున ఇసుకపై రాయడంతో బంగారం రజను తళతళలాడుతూ కనిపిస్తుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మత్స్యకారులు ఒడ్డునే బంగారు రజను కోసం వెతుకుతున్నారు. గత నెలరోజులుగా సముద్రంపై వేటకు వెళ్లని మత్స్యకారులకు రజను వేట కాస్త ఉపశమనం కలిగిస్తోంది.

కానిస్టేబుళ్ల ఎంపిక ఏర్పాట్ల పరిశీలన



పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్

కాకినాడ క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) ఈనెల 30 నుంచి నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ శుక్రవారం పరిశీలించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరంగా మొత్తం 381 సివిల్ కానిస్టేబుళ్ల ఎంపికకు, ఏపీఎస్పీ ఐఆర్ బెటాలియన్‌లో 630 కానిస్టేబుళ్ల పోస్టుల ఎంపికకు జరుగుతున్న ఈ ప్రక్రియలో వివిధ పరీక్షలకు మొత్తంగా పురుషులు 6,333, మహిళలు 1,449మంది హాజరవుతారని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఏఆర్ అడిషినల్ ఎస్పీ శ్రీనివాస్, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టుబడ్డ వ్యవహారంలో కేసు నమోదు

కాకినాడ క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులోని, లంగరురేవులోని ఓ బార్జిలో పీడీఎస్ బియ్యం పట్టుబడ్డ వ్యవహారంలో కేసు నమోదైంది. ఏపీఐవికె 0073 నెంబరు గల బార్జిలో ఇటీవల 1000 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నాయన్న పక్కా సమాచారంతో కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలతో రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారులు యాంకరేజ్ పోర్టులో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 0073 బార్జిలో 1,064 టన్నులు బియ్యాన్ని ఈనెల 20న స్వాధీనం చేసుకున్నారు. రూ.4.60 కోట్ల విలువైన ఈ బియ్యం కరప మండలం, నడకుదురులో ఉన్న లవణ్ ఇంటర్నేషనల్ సార్టెక్స్ ప్లాంట్ చెందినవిగా గుర్తించారు. అనంతరం ఆ సంస్థ ఎండీ కొట్టారి అమిత్ కుమార్‌జైన్, సంస్థ సూపరివైజర్ గొడితి రవికుమార్‌పై 318 (4), బిఎన్ఎస్ 7 (1) ఈసిఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ పి.సునీల్‌కుమార్ తెలిపారు. పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గన్ మిస్ ఫైర్

రిటైర్డ్ మిలటరీ ఉద్యోగికి గాయాలు

నిడదవోలు, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): గన్ మిస్ ఫైర్ అయినా ఘటనలో రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి స్వల్ప గాయాల పాలయ్యాడు. నిడదవోలు మండలం కాటకూటేశ్వరం గ్రామానికి చెందిన కారింకి శ్రీనివాస్ మిలట్రీలో పని చేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన తన గన్‌ను ప్రతి 6నెలలకోసారి నిడదవోలు సీఐ కార్యాలయానికి తనిఖీ చేయిస్తుంటారు. దీనిలో భాగంగానే గురువారం నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయానికి తన గన్‌ను చెక్ చేయించడానికి తీసుకువచ్చారు. స్టేషన్ బయట కూర్చుని గన్ శుభ్రం చేస్తుండగా ట్రిగ్గర్ వేలికి తగిలి మిస్ ఫైర్ అయినట్టు చెబుతున్నారు. ప్రమాదవశాత్తూ బుల్లెట్ రిలీజై ఆయన బొటన వేలికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపారు. నిడదవోలు ఎస్ఐ శోభన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

పోలవరం సందర్శనకు పార్లమెంట్ కమిటీ

జనవరి 10న రాక..

11న పోలవరం పర్యటన

రాజమహేంద్రవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పోలవరం సందర్శనకు పార్లమెంట్ కమిటీ హాజరవుతుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో జేసీ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిశోర్‌తో కలిసి శుక్రవారం సమీక్షించారు. జనవరి 11వ తేదీన సుమారు 30మంది ఎంపీలతో కూడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పోలవరం ప్రాజెక్టు సందర్శిస్తుందన్నారు. 10వ తేదీ రాత్రి మధురపూడి విమానాశ్రయానికి కమిటీ సభ్యులు చేరుకుని రాజమహేంద్రవరంలో బస చేస్తారు. 11న ఇక్కడ నుంచి బయలుదేరి పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్తారని, ఎయిర్ పోర్టు, రాజమహేంద్రవరంలో వారు బస చేసే ప్రాంతంలోనూ కమాండ్ కంట్రోలు రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ పర్యటన విజయవంతం కోసం లైజెనింగ్ అధికారులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీల విడిది కేంద్రం వద్ద 24 గంటలూ ఉండే విధంగా అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. 10న రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని టూరిజం, సాంస్కృతిక శాఖ అధికారులకు సూచించారు. గోదావరి హారతికి ఎంపీలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖ అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ బందోబస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ డీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఈదరపల్లిలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

అమలాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాంకింగ్ చదరంగం పోటీలు సాహిత్ అకాడమీ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం ఈదరపల్లిలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 200 మందికి పైగా చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో వంద మంది వరకు అంతర్జాతీయ రేటింగ్ కలిగిన చెస్ క్రీడాకారులు ఉండడం విశేషం. టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పప్పుల శ్రీరామచంద్రమూర్తి, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ముషిణి సత్యనారాయణ, ఎన్ఆర్ఐ గుబ్బల నాగేశ్వరరావు హాజరయ్యారు. అండర్-6, 8, 10, 12, 14, అండర్-16 బాలురు, బాలికల విభాగాల వారీగా పోటీలు నిర్వహించి మొదటి 3 స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలు జనవరి 17న పెద్దాపురంలో జరిగే నేషనల్ స్కూలు చెస్ టోర్నమెంట్‌కు అర్హత సాధించారని రాష్ట్ర చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కౌరు జగదీష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణికుమార్, కోనసీమ జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్, సంయుక్త కార్యదర్శి రాజీవ్ ప్రకటించారు.

పాదగయ ఆదాయం రూ.24.45 లక్షలు

పిఠాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో హుండీలను శుక్రవారం లెక్కించారు. 72 రోజులకు రూ.24లక్షల 45వేల 110ల ఆదాయం లభించింది. 12.550గ్రాముల బంగారం, 1150 గ్రాముల వెండి వచ్చింది. దేవదాయశాఖ ఆభరణా తనిఖీ అధికారి, అసిస్టెంట్ కమిషనరు వి.పళ్లంరాజు, తనిఖీదారు వి.ఫణికుమార్, ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాకినాడ
• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం
www.andhrajyothy.com

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గత 5ఏళ్లలో వైసీపీ పాలనతో పాటు ఒక ప్రైవేటు డాక్టర్ అనపర్తి ఎమ్మెల్యే కావడం వల్లే గొల్లల మామిడాడ గ్రామీణ ఆరోగ్య కేంద్రం అభివృద్ధి చెందలేదని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు.

'బాల్య వివాహాల నివారణకు కృషి'



సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కిషోరి బాలికలు యుక్త వయసులో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, ఆత్మరక్షణ, విద్య, ఆరోగ్య జీవనోపాధి కోసం ప్రభుత్వ అధికారులు సమన్వయంతో కృషి చేసి బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ కోరారు. శుక్రవారం రమణయ్యపేట మండల కార్యాలయంలో ఐసీడీఎస్ రూరల్ సీడీపీవో వై.లక్ష్మి ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా కిషోరి బాలిక వికాసం కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మహిళా కార్యదర్శులు, విద్యాశాఖ, ఆశా కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా ఆమె ప్రసంగించారు. యుక్త వయసులో రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్యం, జీవనోపాధి కోసం కృషి చేయాలన్నారు. వార్డు, గ్రామ, అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న 11-18 ఏళ్ల లోపు బాలికలతో పాఠశాల, కాలేజీలకు దూరంగా ఉన్న వారిని గుర్తించి, గ్రూపులుగా చేసే బాధ్యత మహిళా కార్యదర్శులకు అప్పగించడం జరిగిందన్నారు. కిషోరి వికాసంపై తొలుత జిల్లా, మండల, గ్రామస్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. బాలికల హక్కులు, సంరక్షణ చట్టాలు, విద్య, ఆరోగ్యం, చేతి విద్య, జీవనోపాధి, లైంగిక దాడులు, టీనేజీ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రీసోర్సు పర్సన్లు డాక్టర్ కె.మాధవి, మల్లీశ్వరి, లలితాదేవి, లక్ష్మీప్రకాశ్, అవగాహన కల్పించారు. డీసీవో సీహెచ్ వెంకట్రావు, ఈవోపీఆర్డీ ఎంఎస్ఆర్ ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీరపు పద్మశ్రీ, ఎం.మోర్తమ్మ, సింహాచలం తదితరులున్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్
- పోలీస్ అధికారులు, సిబ్బందికి వార్షిక ఫైరింగ్ శిక్షణ


ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఫైరింగ్ ప్రాక్టీస్‌కు హాజరైన పోలీసు అధికారులు

పెద్దాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం పెద్దాపురం ఫైరింగ్ రేంజ్ వద్ద వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అన్ని రకాల ఆయుధాలపై పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఫైరింగ్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎస్పీ అత్యాధునిక ఆయుధాలైన ఎస్ఎం - 5, గ్లాస్ పిస్టల్, రివాల్వర్, ఏకే 47, ఇన్సాస్, ఎల్ఎంజీ తదితర ఆయుధాలపై లాంగ్, షార్ట్ రేంజ్ ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. అలాగే ఇతర పోలీస్ అధికారులు చేసిన ఫైరింగ్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఏఎస్పీ సుష్మిత, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, ఎస్డీపీవో శ్రీహరిరాజు, ఎస్ఐ మౌనిక, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాగునీరందే చర్యలు తీసుకుంటున్నాం

గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్


కాలువలు పరిశీలిస్తున్న సునీల్‌కుమార్

గొల్లప్రోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పీబీసీ శివారు ఆయకట్టు వరకూ సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ తెలిపారు. ఏలేరు కాలువపై గొల్లప్రోలు బల్లకట్టు వద్ద పడిన గండ్లు, మల్లవరం ఆర్ఆర్‌బీ ట్యాంకు తూములు, ఊబంద కాలువ, ఇతర పంట కాలువలను ఆయన శుక్రవారం పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పీబీసీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్‌చైర్మన్ దువ్వ వెంకట కొండలరావు, పాలపర్తి వీర్రాజు, ఇరిగేషన్ ఏఈ పద్మజ తదితరులు ఉన్నారు.

పరికరాల వితరణ

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ పీడీయాట్రిక్స్ విభాగాన్ని మరింత విజయ పథంలో నడిపేందుకు రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థి కుటుంబం 2 సీప్యాప్ పరికరాలు, ఆధునిక పరిజ్ఞానంతో నడిచే ఆటో ఎనలైజర్‌ను అందజేశారు. పీడీయాట్రిక్స్ విభాగంలో శుక్రవారం జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డా.శ్రీనివాసన్, చిన్న పిల్లల విభాగాధిపతి డా.డి మాణిక్యాంబ సమక్షంలో దాతలు డా.వంకా రామకృష్ణ ఆయన కుమార్తె డా.జ్యోష్న, అల్లుడు డా.చంద్ర ఈ పరికరాలను అందజేశారు. పీడీయాట్రిక్స్ విభాగ వైద్య నిపుణులు డా.ఎం వెంకటేశ్వర్లు, డా.బుర్రి రాంబాబు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో డెలివరీ

గొల్లప్రోలు, డిసెంబరు 27(ఆంధ్ర జ్యోతి): ఆసుపత్రికి ప్రసవానికి తీసుకువెళ్తుండగా మహిళకు 108 అంబులెన్స్‌లో డెలివరీ అయింది. గొల్లప్రోలు జగనన్న కాలనీకి చెందిన బల్లి గంగాభవానీకి నొప్పులు రావడంతో 108లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో డెలివరీ అయ్యి మగ బిడ్డ పుట్టాడు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పి.వరప్రసాద్, పైలట్ రాజబాబులు వైద్యసేవలు అందించారు.



హమాలీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎఫ్ఎన్‌టీయూ కన్వీనర్ సతీష్


సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

కాకినాడ సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గిడ్డంగుల్లో పనిచేసే హమాలీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ట్రేడ్ యూనియన్ (ఎఫ్ఎన్‌టీయూ)కన్వీనర్ రంబాల సతీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సంజయ్‌నగర్‌లోని కేంద్ర గిడ్డంగుల వద్ద ఏర్పాటు చేసిన కాకినాడ సీడబ్ల్యూసీ గొడౌన్స్ హమాలీ కార్మికుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలంగా కేంద్ర గిడ్డంగులలో పని చేస్తున్న హమాలీ కార్మికులకు ఉపాధి లేక కుటుంబ పోషణ భారం అవుతోందన్నారు. హమాలీ కార్మికులను ఆదుకోవాలని ఎన్ని వినతులు ఇచ్చినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రైవేటు గొడౌన్‌లకు సరుకు తరలింపుపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ప్రభుత్వ రంగ గొడౌన్‌లను సరుకు కేటాయించి కార్మికులను ఆదుకోవాలన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే ఎఫ్ఎన్‌టీయూ ఆధ్వర్యంలో దశలవారీ పోరాటం చేస్తామని ఆయన ప్రకటించారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు శివాజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థల వివాదం

పిఠాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం సమీపంలో ఒక స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదం ఉద్రిక్తతలకు దారితీసింది. పోలీసులు పరిస్థితిని అదుపు చేశారు. మహాసంస్థానం సమీపంలో 11వ వార్డులో 545 గజాల ఖాళీ సలం ఉంది. దీనిని అభివృద్ధి చేసేందుకు రాజమహేంద్రవరానికి చెందిన కానూరు వెంకటేశ్వరరావు జేసీబీతో వచ్చి శుభ్రం చేస్తున్నారు. ఆ సమయంలో ఆటోలు, కార్లు పార్కింగ్‌కు వినియోగిస్తున్న కొందరు వచ్చి అడ్డుకున్నారు. దీంతో 2 వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా తాము ఈ స్థలాన్ని ముగ్గురు వ్యక్తులు నుంచి 2018లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని కానూరు వెంకటేశ్వరరావు తెలిపారు. తాము స్థలాన్ని చదును చేయడానికి ప్రయత్నిస్తుంటే దానిని ప్రవేటు పార్కింగ్ స్థలంగా చేసి రుసుములు వసూలు చేసుకుంటున్న కొందరు ఆక్రమణదారులు వచ్చి తమను అడ్డుకోవడంతో పాటు భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. ఈ సంఘటనపై వీడియో సాక్ష్యాలతో సహా పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశామని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లుతున్నట్టు తెలిపారు.


పిఠాపురంలో స్థల వివాదం దృశ్యం

పిఠాపురంలో ఫ్లెక్సీల వివాదం

తొలగింపుపై మున్సిపల్ కార్యాలయం వద్ద జనసేన ఆందోళన


పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న జనసైనికులు

పిఠాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో మరోమారు ఫ్లెక్సీల వివాదం నెలకొంది. పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ జనసేన నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. దీనిపై జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కార్యాలయం వద్ద సాయంత్రం ధర్నా, రాస్తారోకోకు దిగారు. మున్సిపల్ అధికారులు ఏకపక్షంగా జనసేన ఫ్లెక్సీలను మాత్రమే తొలగించారని, మిగిలిన ఫ్లెక్సీలను అలాగే వదిలివేశారని ఆరోపించారు. తమ ఫ్లెక్సీలు ఎందుకు తొలగించారంటూ కార్యాలయంలో టీపీఎస్ ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. తొలగిస్తే అందరివి తొలగించాలి తప్ప తమవి మాత్రమే తొలగించడం ఏంటని నిలదీశారు. తాము అందరి ఫ్లెక్సీలు తొలగిస్తామని అధికారులు సమాధానమిచ్చారు. అయితే వారు సంతృప్తి చెందలేదు. కార్యాలయం వద్ద ఆందోళనకు దిగగా పిఠాపురం పట్టణ ఎస్ఐ మణికుమార్ వచ్చి వారికి సర్దిచెప్పారు. ఈ వివాదం తర్వాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న టీడీపీ ఫ్లెక్సీలను సిబ్బంది తొలగించడం గమనార్హం. పట్టణంలో అన్ని ఫ్లెక్సీలను వాటిని ఏర్పాటు చేసుకున్న వారు తొలగించుకోవాలని, లేకుండా తామే తొలగిస్తామని టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారు.


పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో టీపీఎస్‌ను ప్రశ్నిస్తున్న జనసైనికులు

30న ధర్నాలు

సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రసాదరావు

పెద్దాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 30న మండల కేంద్రాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం యాసలపు సూర్యారావు భవనంలో ధర్నా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, దారపురెడ్డి క్రాంతికుమార్, కృష్ణ, సత్యనారాయణ, వీర్రాజు, అప్పన్న, స్నేహ, సత్తిబాబు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్, ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఖాజా రహంతుల్లా తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో పరిధిలోని ప్రధానమైన పెద్దాపురం-పాయకరావుపేట 132కేవీ విద్యుత్‌లైను మార్పులో భాగంగా పనులు నిర్వహిస్తున్నందున చేబ్రోలు వాటర్‌వర్క్స్, చేపల చెరువులు, మల్లవరం, ఏ.విజయనగరం, గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేట ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8గంటలు నుంచి సాయంత్రం 5గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అంచనా బడ్జెట్ ఆమోదం


బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీలలిత

పెద్దాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో డి.శ్రీలలిత ఆధ్వర్యంలో సర్వసభ్య బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. పెద్దాపురం మండల సాధారణ అంచనా బడ్జెట్ 2025-26 సంవత్సరానికి మొత్తం ఆదాయం రూ.83.0575 కోట్లు, అలాగే మొత్తం వ్యయం రూ.83.0513 కోట్లుగా చూపించగా, మిగులు బడ్జెట్ రూ.62,300గా చూపించారు. ఈబడ్జెట్‌ను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ఎంపీడీవో తెలిపారు. అలాగే బడ్జెట్ సమావేశానికి ముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి రెండు నిమషాలు మౌనం పాటించారు. అలాగే ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెంకే సత్యవతి, ఎంఈవో ప్రభాకరశర్మ, ఈవోపీఆర్డీ బీవీవీ రమణ, ఏవో ఎంఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నిరసన


కాకినాడలో ఆందోళన చేస్తున్న నాయకులు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎస్ఈ కార్యాలయం ఎదుట కాకినాడలో సిటీ, రూరల్ నియోజకవర్గాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు, నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నినదించారు. అనంతరం ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం ఎదుట నాయకులు, కార్యకర్తలు బైఠాయించారు. పెంచిన చార్జీలను తగ్గించేవరకు ప్రజల పక్షాన పోరాడతామంటూ నినదించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి శివకుమారి, అనుబంధ విభాగాల ప్రతినిధులు అల్లి రాజబాబు, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ పోలసపల్లి సరోజ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు పసుపులేటి వెంకటలక్ష్మి, బెండా విష్ణుమూర్తి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్ పాల్గొన్నారు.

సామర్లకోట(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెంపుదలను నిరసిస్తూ సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ ఏడీఈ కార్యాలయం ఎదుట శుక్రవారం వైసీపీ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. వైసీపీ మండల అధ్యక్షుడు తలారి దొరబాబు, వైసీపీ పట్టణ నాయకుల ఆధ్వ ర్యంలో నిర్వహించిన ధర్నాకు ముఖ్యఅతిథిగా వైసీపీ పెద్దాపురం ఇన్‌చార్జి దవులూరి దొరబాబు హాజరయ్యారు. విద్యుత్ చార్జీలను పెంపుదల చేయడం అన్యాయం అన్నారు. తొలుత వైసీపీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రదర్శనగా తరలివెళ్లారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏడీఈ కిరణ్‌కు దొరబాబు అందజేశారు. వైసీపీ నాయకులు అధికసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): కరెంటు చార్జీలు పెంపునకు నిరసనగా పిఠాపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయం నుంచి ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వరకు ప్రదర్శన జరిపారు. వివిధ రకాల చార్జీల పేరుతో వినియోగదారులపై మోయలేని భారం మోపుతున్నారని నాయకులు విమర్శించారు. ఏపీఈపీడీసీఎల్ అధికారులను వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ పాల్గొన్నారు.

దేశానికి దారి చూపిన ఆర్థిక దిక్సూచి మన్మోహన్‌సింగ్

కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు చెక్కా నూకరాజు


మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు నూకరాజు, నాయకులు

కాకినాడసిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్థిక మాంద్యం నుంచి గట్టెక్కిస్తూ దేశానికి దారి చూపిన ఆర్థిక దిక్సూచి మన్మోహన్‌సింగ్ అని కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు చెక్కా నూకరాజు కొనియాడారు. శుక్రవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీ అధ్యక్షుడు చెక్కా నూకరాజు, పీసీసీ సభ్యుడు పోలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ మరణంతో దేశం దిగ్గజ నాయకుడిని కోల్పోయిందన్నారు. దేశానికి రెండుసార్లు ప్రధానిగా సేవలు అందించిన గొప్ప ఆర్థిక వేత్తని అన్నారు. 1991-96లో కేంద్ర ఆర్థిక మంత్రిగా ప్రవేశపెట్టిన సంస్కరణలు, 2004 నుంచి 2014 వరకు దేశ ప్రధానిగా అందించిన సేవలను మరువలేమన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పబ్బినీడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో మన్మోహన్‌సింగ్‌కు కీర్తి ప్రతిష్టలు

కాకినాడ సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతిని పెంపొందింపజేసిన మన్మోహన్‌సింగ్ కీర్తి ప్రతిష్టలు అంతర్జాతీయ స్థాయిలో విరాజిల్లుతున్నాయని ఏపీ స్టేట్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ బోర్డు మాజీ సభ్యుడు, కార్మిక నాయకుడు సీహెచ్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆకస్మిక మృతి దేశానికి తీరని లోటని సంతాపం తెలిపారు. దేశాన్ని ఆదర్శవంతంగా అగ్రగామిగా నిలిపారన్నారు. ఆర్‌బీఐ గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, రాజ్యసభ సభ్యులుగా దీర్ఘకాలం పని చేశారన్నారు. దేశానికి అనేక సంస్కరణలు అందించారన్నారు. 2005-06లో పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కూలీలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.

మత్స్యకారులకు ఇళ్లు మంజూరు చేయాలి


ఉప్పాడ తీరంలో సముద్రకోతకు గురైన ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొత్తపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సముద్రకోతకు గురైన తీరప్రాంత మత్స్యకారులకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేయాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఏర్పడిన అల్పపీడనాల కారణంగా సముద్ర కోతకు గురైన ప్రాంతాన్ని, మత్స్యకారుల ఇళ్లను సీపీఎం జిల్లా నాయకులు కరణం ప్రసాదరావు, జిబేబీరాణి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పాడ తీరప్రాంతంలో కెరటాల ఉధృతికి అనేక మంది మత్స్యకారుల ఇళ్లు కోతకు గురవుతున్నాయన్నారు. వందల మీటర్లు సముద్రం ముందుకు దూసుకువస్తుందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఎటువంటి శాశ్వత నివారణ చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఇళ్లు కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారులకు హామీ ఇచ్చిన మేరకు వేట నిషేధ భృతిని వెంటనే విడుదల చేయాలని, అలాగే తీరం వెంబడి కాంక్రీటు గోడ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం కొత్తపల్లి మండల కార్యదర్శి గురాల అప్పారెడ్డి, కె నాగేశ్వరరావు, జి వెంకట సుబ్బిరెడ్డి, సీహెచ్ పద్మ చిన్ని, చీకట్ల సాంబశివరావు, అంగర వాసు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

3న ఓఎన్జీసీ పరిహారం



తాళ్లరేవు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికారణం కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు మత్స్యకారులకు ఓఎన్జీసీ నష్టపరిహారం పంపిణీ వాయిదా పడిందని, జనవరి 3వ తేదీన మత్స్యకారులకు కోరింగలో నష్టపరిహారం పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శుక్రవారం తెలిపారు. జనవరి 3న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మత్స్యకారులు నాగిడి నాగేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, పెంసింగి ఈశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, పైదాడి శ్రీనివాసరావు, మల్లాడి వరదరాజు, పినపోతు సోమరాజు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అకాలమృతికి కోరింగలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో పలువురు నేతలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తుల సాయి, దాట్ల ప్రుధ్వీరాజ్, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, పిల్లి సత్తిబాబు, నడింపల్లి వినోద్, పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

మా క్లైంట్ గారైన నిరోగి వెంకటసత్యశివరామమూర్తి, సన్నాఫ్ లేట్ నిరోగి వెంకటరావు, కాకినాడ నివాసం వారిచ్చిన సంజాయిషీపై యావన్మందికీ తెలియజేయునదేమనగా, మా క్లైంట్ గారు శివరామమూర్తి గారు 20-03-2015న చిట్టూరి ఇంద్రనీల్, మేనేజర్ టీవీ సీఫుడ్స్, జగ్గంపేట బ్రాంచ్, సెకెండ్ ఫ్లోర్, సమతా అపార్ట్‌మెంట్స్, శారదా స్ట్రీట్, శ్రీనగర్, కాకినాడ వారి నుండి రూ.1,55,00,000 (ఒక కోటి యాభై ఐదు లక్షల రూపాయలు) బదులుగా పుచ్చుకుని, వారి సంతకంతో కూడిన పది ప్రామిసరీ నోట్లు, ఐదు బ్లాంక్ చెక్కులు మరియు వారి ఆస్తులకి సంబంధించిన ఐదు దస్తావేజులు హామీగా ఇచ్చి ఉన్నారు. ఐతే, సదరు బాకీ తీర్మానం నిమిత్తం 2019వ సంవత్సరంలో ఐచ్చు సత్యనారాయణ మూర్తి అనే ఐచ్చు సంతోష్ ద్వారా ఎక్స్ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి గారి వద్ద పెట్టి రూ.3,26,00,000 (మూడు కోట్ల ఇరవై ఆరు లక్షల రూపాయలు)కు చిట్టూరి ఇంద్రనీల్ గారికి చెల్లించుటకు తీర్మానించి, రూ.3,10,00,000 (మూడు కోట్ల పది లక్షల రూపాయలు) నా క్లైంట్ గారు ఇంద్రనీల్ గారికి చెల్లించుటకు అంగీకరింపజేసి ఉన్నారు. దానిపై సదరు తీర్మానం ప్రకారం 25-11-2019న నా క్లైంట్ గారు వారి ఆస్తిని కూసం ఈశ్వరమ్మ గారి నుండి రూ.3,10,00,000 (మూడు కోట్ల పది లక్షల రూపాయలు) అప్పుగా పుచ్చుకుని ఇంద్రనీల్ గారికి కట్టివేసి ఉన్నారు. సందరు అప్పుకు హామీగా కూసం ఈశ్వరమ్మ గారి పేర కాకినాడ మెయిన్ రోడ్లో రేమాండ్స్ బట్ట దుకాణం, బాల్ చంద్ గారికి చెందిన షాపుకు సేల్ డీడ్ రాయించుకున్నారు. సదరు సేల్ డీడ్ కింద ఇచ్చినటువంటి సొమ్మును 30-03-2027 నాటికి వడ్డీతో నా క్లైంట్ గారు చెల్లించిన కూసం ఈశ్వరమ్మగారు 25-11-2019 సేల్ డీడ్ ని రద్దు చేసుకొనుటకు అంగీకరించి ఉన్నారు. ఇది ఇట్లుండగా, బాకీ తీర్మానం ఇంద్రనీల్ గారికి అయిపోయిననందున వారు 20-03-2015న హామీగా ఇచ్చిన పది ప్రామిసరీ నోట్లు, ఐదు చెక్కులూ, ఐదు దస్తావేజులూ బ్యాంక్ లాకరు నుంచి తీసుకుని అప్పజెపుతానని చిట్టూరి ఇంద్రనీల్ గారు నా క్లైంట్‌ని నమ్మించి 25-11-2019న సొమ్ము పుచ్చుకుని ఉన్నారు. నా క్లైంట్ గారి సోదరుడు నిరోగి వెంకటరమణమూర్తి గారి ప్రోద్బలంతో నా సోదరుడు వేసినటువంటి ఓ.ఎస్ 1/2012 దావా రాజీ చేసుకుని రావాలని, అప్పుడే కాగితాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పి ఉన్నారు. 26-11-2019 నుండి నేటి వరకూ సదరు కాగితాలు ఇవ్వలేదు. 25-11-2024న నా క్లైంట్ గారికి ఇంద్రనీల్ గారు కబురు పంపి ఇంకా తనకు రూ.4,50,00,000 (నాలుగు కోట్ల యాభై లక్షల రూపాయలు) ఇస్తే గాని నా క్లైంట్ గారు ఇచ్చినటువంటి కాగితాలు (అనగా పది ప్రోనోట్లు, ఐదు చెక్కులు, ఐదు ఆస్తులకు సంబంధించిన దస్తావేజులు) ఇవ్వనని మరియు సదరు కాగితాలను పురస్కరించుకుని ఆయన బంధువర్గం పేరున గానీ, ఆయన పేరున గానీ దావాలు వేసి నా క్లైంట్ గారి ఆస్తులను వేలం వేయిస్తానని బెదిరించుచున్నారు. అదియూ కాక, నా క్లైంట్ గారికి పవర గ్రామంలో ఉన్న 3-69 బిల్డింగు మరియు స్థలంను తనకి కావాల్సిన వారి పేరున దౌర్జన్యంగా కాకినాడలో గానీ, సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ వారి వద్ద గానీ రిజిస్ట్రేషన్ చేయించుకుని సదరు ఆస్తిని ఆక్రమిస్తానని బెదిరించుచున్నారు. ఇందు మూలంగా యావన్మందికీ తెలియజేయునదేమనగా, నా క్లైంట్ నిరోగి వెంకట సత్యశివరామమూర్తి గారు, చిట్టూరి ఇంద్రనీల్ గారికి ఎటువంటి బాకీ లేరనీ మరియు ఎవరైనా వారి ప్రోత్సాహంతో, వారి వద్ద ఉన్నటువంటి నా క్లైంట్ గారి కాగితాలను వినియోగించడానికి సహకరించినా, తగు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు భాద్యులగుదురని తెలియజేయడమైనది.

కాకినాడ
27-12-2024

యనమండ్ర శ్రీరాములు
అడ్వకేటు, కాకినాడ, సెల్: 9701857162

గడువులోపు సర్వే పూర్తి చేయాలి

కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణన సర్వే నివేదిక సంబంధించిన తుది జాబితాను వచ్చే నెల 10వతేదీ నాటికి సిద్ధం చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. శుక్రవారం కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో పలు అంశాలపై జరిగిన సమీక్ష, శిక్షణ కార్యక్రమాల్లో కమిషనర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కమిషనర్ భావన మాట్లాడుతూ ఎస్సీ కులగణన సర్వేకు సంబంధించి ఎవరి నుంచైనా ఎటువంటి అభ్యంతరాలున్నా ఈనెల 31వతేదీలోపు స్వీకరించాలని, 6వ తేదీ నాటికి తుది జాబితాను సిద్ధం చేయాలని, 10వతేదీ నాటికి ఫైనల్ లిస్టును ప్రచురించాలని సూచించారు. అలాగే ఎంఎస్ఎంఈ ఆన్‌లైన్ చేయడంపై పలు సూచనలు చేశారు. మిస్సింగ్ సిటిజన్స్‌ను హౌస్‌హోల్డ్స్‌గా నమోదు చేసే విషయంపై చర్చించారు.

ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ ఆదేశం


ఆక్రమణలు తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్

సామర్లకోట, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): సామర్లకోట పట్టణంలో పలు ప్రాంతాల్లో ఆక్రమణలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. జగ్గమ్మగారిపేట ప్రాంతంలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో ఎక్స్‌కవేటర్ సాయంతో ఆక్రమణలను తొలగించే పనులు చేపట్టారు. మురుగు కాల్వలను ఆక్రమించిన వైనాన్ని కౌన్సిలర్ పితాని కృష్ణ కమిషనర్ శ్రీవిద్యకు ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని తేటగుంట ఉప కేంద్రం పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో జగ్గంపేట ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. ఎర్రకోనేరు, వెంకటాపురం, గవరపేట, తేటగుంట పరిసరాల్లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



టేకు ప్లాంటేషనలో కలిసిన పూర్వ విద్యార్థులు

డొంకరాయిలో విద్యార్థుల అ'పూర్వ' కలయిక

మోతుగూడెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయి హైస్కూల్లో 1985-2000 మధ్య చదువుకున్న విద్యార్థులు టేకు ప్లాంటేషన్‌లో శుక్రవారం గెట్ టు గెదర్ నిర్వహించారు. కొందరు తెలంగాణలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారస్తులు, మరికొందరు ఆంధ్రాలో ప్రభుత్వ ఉద్యోగులుగా చేస్తున్నారు. ఒకరిని ఒకరు కౌగిలించుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. గత స్మృతులను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. చిన్నపిల్లల్లా ఆటపాటలతో సందడి చేశారు. తాము చదువుకున్న పాఠశాలకు వెళ్లి ఆనాటి రోజులను గుర్తు చేసుకున్నారు. వాసంశెట్టి కిరణ్ (ఏపీ జెన్‌కో, డొంకరాయి), కె.వాసుదేవరావు (పోస్టల్ డిపార్టుమెంట్, డొంకరాయి), పిల్లా శ్రీనివాసరావు (ఏపీ జెన్‌కో, భూపాలపల్లి, తెలంగాణ), జి.నాగేశ్వరరావు (ఏపీ జెన్‌కో, నెల్లూరు), ఎం.దుర్గాప్రసాద్ (సాఫ్ట్‌వేర్, హైదరాబాద్), సీహెచ్ రమేష్‌బాబు (అమలాపురం), జి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జమాల్ ఖాన్

'మన్మోహన్ సింగ్ సేవలు మరువరానివి'

చింతూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు మరువరానివని జేకే చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ జమాల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం చింతూరులో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన గొప్ప ఆర్థిక వేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఎస్‌కే రియాజ్, నాజర్‌ఖాన్, నటరాజ్, విక్కీ, రమణ, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణానికి చింతిస్తూ అడ్డతీగల దేవి సెంటర్‌లో కాంగ్రెస్ నాయకుడు దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశానికి ఎనలేని సేవలు చేసి చరిత్రలో నిలిచిన ఘనత మన్మోహన్ సింగ్‌కే దక్కుతుందన్నారు. మంచి సంస్కరణలతో మరింత ఆర్థిక అభివృద్ధి సాధించారన్నారు. మన్మోహన్ మృతికి కాంగ్రెస్ పార్టీకి, దేశ ప్రజలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గండిపోశమ్మ ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

దేవీపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపోశమ్మ అమ్మవారి ఆలయం 2025 సంవత్సరం క్యాలెండర్‌ను రంపచోడవరం సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) లక్ష్మీకుమార్, సీనియర్ అసిస్టెంట్ సూరిబాబు, పూజారి వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

పారదర్శకంగా ఆయా పోస్టుల భర్తీ

రంపచోడవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ పరిధిలో కొత్తగా మంజూరైన అంగన్వాడీ ఆయా పోస్టుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ తెలిపారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన గిరిజన అభ్యర్థులనే ఎంపిక చేస్తామన్నారు. సీడీపీవోలు సంధ్యారాణి, లక్ష్మీప్రసన్న, దేవమణి, సూపర్‌వైజర్లు సుధ, సత్యవతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

'వైసీపీ పాలనంతా పంపకాలతోనే సరి'

కూనవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలన అంతా లంచాలు, పంపకాలతో సరిపోయిందని వైసీపీ నాయకులపై టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం జరిగిన టీడీపీ సమావేశంలో మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు మాట్లాడుతూ తమ పార్టీ నాయకులపై వైసీపీ కార్యకర్తలు వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ దిగజారుడు ప్రకటనలు చేస్తున్నారన్నారు. మరం భాస్కర్‌పై, ఎమ్మెల్యే శిరీషదేవిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజాగ్రహానికి గురవుతున్నారన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు, అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు, గడేశుల ప్రేమ్‌చంద్, చెలకాని ఉమామహేశ్వరరావు, సోమయ్య, బండారు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

వీఆర్ పురం మండల సమావేశం వాయిదా

వీఆర్ పురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వీఆర్ పురం మండల సమావేశాన్ని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ సోమవారానికి వాయిదా వేశారు. ఎంపీపీ కారం లక్ష్మి, జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మన్మోహన్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపీడీవో శశిభూషణ్, సర్పంచ్‌లు పులి సంతోష్‌కుమార్, పూనెం సరోజిని, కారం బుచ్చమ్మ, సవలం మారయ్య, ఎంపీటీసీ పూనెం ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలుపుతున్న ఎంపీపీ, జడ్పీటీసీ

ప్రభుత్వ కార్యాలయంలో మత ప్రచారం!

రాజవొమ్మంగి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి ఉపాధి హామీ కార్యాలయంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నామంటూ సమీప ప్రభుత్వ కార్యాలయాల అధికారులను, సిబ్బందిని ఆహ్వానించారు. ఎంపీడీవో యాదగిరేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొందరు మతపరమైన పాటలను పాడడం, ఉపన్యాసాలు ఇవ్వడం చర్చనీయాంశమైంది. కేక్ కట్ చేసి అధికారులు వేడుకలను ముగించారు. అయితే దీనిపై 24 గంటల్లో వివరణ ఇవ్వాలంటూ ఉపాధి హామీ ఏపీవో సురేష్‌కుమార్‌కు శుక్రవారం సాయంత్రం ఎంపీడీవో యాదగిరేశ్వరరావు మెమో ఇచ్చారు.

వీఆర్ పురంలో 30న నిరసన కార్యక్రమం

వీఆర్ పురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా కోరుతూ వీఆర్ పురంలో ఈనెల 30న జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సున్నం రాజులు కోరారు. రేఖపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, ఎంపీపీ కారం లక్ష్మి, మండల కమిటీ సభ్యులు పొడియం శ్రీరామ్మూర్తి, పంకు సత్తిబాబు, జి.లక్ష్మణరావు, వడ్లాది రమేష్, కె.సత్తిబాబు, తుర్రం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

'ఆదిత్య' పాలిటెక్నిక్ విద్యార్థులకు పతకాల పంట

గండేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాకినాడ, బొమ్మూరు పాలిటెక్నిక్ కళాశాలల్లో నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా పోటీల్లో ఆదిత్య పాలిటెక్నిక్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించినట్టు ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. కె.సాంబశివరావు డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో గోల్డ్, పి.శ్రీగుప్తా వంద మీటర్ల విభాగంలో గోల్డ్, 200 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్, ఎ.శివశంకర్ 1,500 మీటర్ల పరుగులో సిల్వర్, 800 మీటర్ల పరుగులో బ్రాంజ్, జి.అవినాష్‌కుమార్ 200, 400 మీటర్ల పరుగు పందేల్లో గోల్డ్, కె.వెంకట్‌తేజ ట్రిపుల్ జంప్‌లో సిల్వర్, ఎస్.సతిహ చదరంగంలో గోల్డ్, వి.సాయికృష్ణతులసి షాట్‌పుట్, డిస్కస్ త్రోల్లో గోల్డ్, ఎల్.సాయిసత్యజ్యోతి షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్స్ సాధించారు. జి.అవినాష్‌కు ఇండివిడ్యుల్ ఛాంపియన్‌షిప్, ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలకు ఓవరాల్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ లభించింది. విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ మురళీమోహన్, కె.శేఖర్‌రెడ్డిలను అభినందించారు. ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్, డీన్ ఏవీ మాధవరావు, అసోసియేట్ డీన్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య వైస్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి



జడ్జి కాటం భానును సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

ప్రత్తిపాడులో క్రిస్మస్ వేడుకలు

ప్రత్తిపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి కాటంభాను క్రీస్తు సందేశాన్ని వివరించారు. ఆయన్ను బార్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, నాయకులు బొంగులూరు మధుబాబు, ఆర్.వెంకట్రావు, నాగేంద్ర సన్మానించారు. ధర్మవరం చర్చిలో ఎంఎంఆర్ ట్రస్టు అధినేత మురళీ రాజు, సర్పంచ్ డి.సుశీలఅబ్బాయి, జువ్వల దొరబాబు కేక్ కట్ చేశారు.

1,100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాలెంలో శుక్రవారం ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, సిబ్బంది దాడులు చేశారు. 1,100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి

ప్రత్తిపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత ప్రజాస్వామ్యానికి చిరస్మరణీయుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పద్మనాభం, ఆయన తనయుడు గిరిబాబు పూలలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మన్మోహన్ చిత్రపటానికి పీసీసీ సభ్యుడు దర్నాలకోట శ్రీను, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, కందిమళ్ళ శామ్యూల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్థిక సంస్కరణల వేత్త మన్మోహన్

తుని రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆర్థిక రంగంలో మేధాసంపన్నుడైన మన్మోహన్ సింగ్ దేశానికి విశేషమైన సేవలు అందించారని గుర్తు చేశారు. ప్రధాన మంత్రిగా అనేక ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. దారి తప్పిన భారత ఆర్థిక వ్యవస్థను వృద్ధివైపుగా నడిపించారన్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటని సంతాప సందేశంలో పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ మృతికి తుని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ యనమల దివ్య సంతాపం వ్యక్తం చేశారు.



ప్రత్తిపాడులో మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీసీసీ సభ్యుడు శ్రీను

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతితో దేశం మహోన్నత వ్యక్తిని కోల్పోయిందని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ అన్నారు. మన్మోహన్ సింగ్ మృతికి వారు సంతాపం తెలిపారు.

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): దేశానికి ఆర్థిక సంస్కరణలు అందజేసిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం తీరని లోటని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్ అన్నారు. జగ్గంపేటలో మన్మోహన్ చిత్ర పటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు.





జగ్గంపేటలో వైసీపీ నేతలు, కార్యకర్తలు ప్రదర్శన, ప్రత్తిపాడులో వినతిపత్రం ఇస్తున్న ముద్రగడ పద్మనాభం. గిరిబాబు

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

వైసీపీ నాయకులు, కార్యకర్తలు పోరుబాట

జగ్గంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ వైసీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ఆధ్వర్యంలో శుక్రవారం పోరుబాట నిర్వహించారు. జగ్గంపేట శివారు కోనేటి దగ్గర నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ జరిపారు. విద్యుత్ శాఖ డీఈకి వినతిపత్రం అందజేశారు. వైసీపీ యువ నాయకుడు తోట రాంజీ, నాలుగు మండలాల అధ్యక్షులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిర్లంపూడి/ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ప్రత్తిపాడు నియోజవకర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో కిర్లంపూడి నుంచి ప్రత్తిపాడు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రత్తిపాడు ఏఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఈకి అందజేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ర్యాలీగా కళామందిర్ సెంటర్‌కు చేరుకుని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేశారు. జడ్పీటీసీలు బెహరా రాజరాజేశ్వరిదొరబాబు, బొల్లు చిన దివానం, ఎంపీపీ జీకే సుధాకర్, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనివాస్, నాయకులు గుడాల వెంకటరత్నం, శిడగం వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి జమీలు, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, జువ్విన వీర్రాజు, జలిగంపల ప్రభాకర్, రామిశెట్టి బులిరామకృష్ణ, పాకా చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, వైసీపీ నాయకుడు యనమల కృష్ణుడు డిమాండ్ చేశారు. సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు.



తునిలో వైసీపీ నేతల ధర్నా

'కిశోరీ వికాస్' శిక్షణ

గండేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగి అభివృద్ధి పథంలో ముందడుగు వేయాలనే నమ్మకం ఇవ్వడమే మనం సాధించగలిగే అసలైన విజయమని గండేపల్లి ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. శుక్రవారం గండేపల్లి స్త్రీశక్తి భవనంలో సీడీపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో 'కిశోరి వికాస్' శిక్షణ ఇచ్చారు. జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, ఏపీఎం పి.సన్యాసిరావు, నరేన్, సిబ్బంది పాల్గొన్నారు.

'కౌమార దశ కీలకం'

ప్రత్తిపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాలబాలికల జీవిత చక్రంలో కౌమార దశ అత్యంత కీలకమైనదని ఐసీడీఎస్ ప్రత్తిపాడు సీడీపీవో ఆర్‌వీఎస్ లక్ష్మి చెప్పారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ళ కాంతిసుధాకర్ అధ్యక్షతన బాల్యవివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టం గురించి ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు వివరించారు. హెచ్‌ఎంలు, అంగన్వాడీలు, ఏఎన్‌ఎంలు, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

ప్రత్తిపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సర్కిల్‌లోని ఏలేశ్వరం, అన్నవరం పోలీస్‌స్టేషన్లలో డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురు పట్టుబడ్డారు. వారిలో ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున జరిమానా, మరో వ్యక్తికి 7 రోజులు జైలుశిక్ష విధిస్తూ జడ్జి కాటం భాను శుక్రవారం తీర్పు చెప్పారని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు.

నెల్లిపూడిలో రెవెన్యూ సదస్సు

శంఖవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ సమస్యల రహిత గ్రామాలను తీర్చిదిద్దడమే చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు బద్ది రామారావు అన్నారు. శుక్రవారం నెల్లిపూడి నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులతో పాటు ఆయన పాల్గొన్నారు. బద్ది రమణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

జగ్గంపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 11 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.8,99,529 నగదును చెక్కుల రూపంలో శుక్రవారం జగ్గంపేటలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందజేశారు. కార్యక్రమంలో నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూలు ఛైర్మన్ గల్లా రామచంద్రరావు, జగ్గంపేట ఏలేరు డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్ నీలం శ్రీను, బుర్రి సత్తిబాబు, ఇటికాయలపల్లి సర్పంచ్ రామకృష్ణ, పాలచర్ల సత్యనారాయణ, కాకిలేటి రాయుడు, గోడే దొరబాబు, కోన శివనాయుడు, ఆశీర్వాద్ రియల్ ఎస్టేట్ కేఎస్ రాజు, వెలిశెట్టి బుజ్జి, కాకిలేటి బుజ్జి, నలమాటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న జ్యోతుల నవీన్

'నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి'

శంఖవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా అదనపు కో-ఆర్డినేటర్ వేణుగోపాలరావు కోరారు. శుక్రవారం ఆయన కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పది, ఇంటర్ విద్యార్థులకు పంచతంత్ర యాక్షన్ ప్లాన్ అమలు చేయాలన్నారు. వీక్లీ, గ్రాండ్ టెస్టుల ఫలితాలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు.

ఆర్‌ఎంపీ వైద్యుడు బెనబాబుకు అవార్డులు

అన్నవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో రెండు దశాబ్దాలుగా ఆర్‌ఎంపీగా సేవలందిస్తున్న పదిలం బెనబాబుకు మానికిరెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కన్స్యూమర్ అవార్డు, ఛత్రపతి శివాజీ పురస్కార్ అందించారు. వైద్యంతో పాటు సామాజిక సేవ చేస్తున్న బెనబాబు మానికిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మానికిరెడ్డి సత్యనారాయణ ఈ అవార్డులు అందజేశారు.

'విమానాశ్రయానికి భూములు ఇవ్వం'

తొండంగి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయ నిర్మాణానికి తమ భూములు ఇవ్వబోమని పీతః చిన్నయ్యపాలెం రైతులు అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం ఆ గ్రామంలో తహసీల్దారు మురార్జీ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. హాజరైన రైతులు మాట్లాడుతూ పచ్చని మూడు పంటలు పండే తమ భూములను విమానాశ్రయానికి ఇచ్చి తాము బికారులుగా మారలేమన్నారు. వెంటనే ఈ ప్రాంతంలో విమానాశ్రయ నిర్మాణ ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేత నరహరిశెట్టి సూర్యప్రకాష్ మాట్లాడుతూ రైతుల వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. గ్రామపరంగా వున్న పలు సమస్యలను ప్రతిపాదించి వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేసారు. వడ్డి రాంబాబు, ఆర్.ఆనంద్, తంగెళ్ళ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



హరిదాసుకు సత్కారం

ఏలేశ్వరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపర్తిలో హరిదాసు నీలాల ప్రసాద్‌ను ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు ఆలమూరి సుబ్బారావు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా హరిదాసుగా గ్రామాల్లో పర్యటించి హిందూ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. గవరసాని పెద్దకాపు, ఉడతల రమణారావు, మాటూరి కృష్ణ మంగయ్య, హనుమంతు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

అన్నవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్ర రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపాలు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సత్యప్రభకు బొకే అందజేస్తున్న పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల

పుష్కర ఆధునికీకరణకు కృషి

ప్రత్తిపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పుష్కర ఆధునికీకరణకు కృషి చేస్తానని ఆ ప్రాజెక్టు చైర్మన్ అడబాల భాస్కరరావు చెప్పారు. శుక్రవారం ఆయన టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సకాలంలో నీరందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హిందీ సాహిత్యంలో సామాజిక స్పృహపై వెబినార్

తొండంగి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'హిందీ సాహిత్యంలో సామాజిక స్పృహ' అంశంపై జాతీయ స్థాయి వెబినార్ నిర్వహించారు. డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ యూనివర్సిటీ హిందీ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీరత్నాకర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగాధిపతి ప్రొఫెసర్ విజయభారతి ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ అధ్యక్షతన జరిగిన వెబినార్‌లో దేశంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలకు చెందిన అధ్యాపకులు పాల్గొని వివిధ వర్గాల ఉన్నతికి, వారిలో సామాజిక చైతన్యం కోసం కవులు చేసిన కృషిని వివరించారు. పీవీ కృష్ణారావు, డాక్టర్ రాజశేఖర్, శ్రీనుబాబు, టి.రాము, సుమారు 120 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఆక్రమణలు వాస్తవమే'

జగ్గంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'చెరువు చుట్టూ ఆక్రమణలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై సంబంధిత అధికారి శ్రీనివాసును వివరణ కోరగా... తమ సమీపంలో ఉన్న గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట సర్వే నెం.170/1ఎలో 28.82 సెంట్ల ఎకరాల ప్రభుత్వ చెరువు ఉందన్నారు. కొందరు దానిని ఆక్రమించుకున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. తాము పరిశీలించగా వాస్తవమని తేలిందన్నారు. గత ప్రభుత్వంలో అన్యాక్రాంతమైందని, అక్రమ కట్టడాలు జరిగిన మాట వాస్తవమేనన్నారు. రెవెన్యూ అధికారుల సహాయంతో సర్వే జరిపించి చెరువును పూర్తి స్థాయిలో విస్తరణ చేయిస్తామన్నారు.

ట్రాక్టర్ ప్రారంభం

జగ్గంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇర్రిపాక పంచాయతీకి స్వచ్ఛ భారత్ నిధుల నుంచి నూతన ట్రాక్టర్ మంజూరైంది. శుక్రవారం దానిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించారు.

నిరక్షరాస్యుల కోసం 62 మంది వలంటీర్లు ఏర్పాటు

ప్రత్తిపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 23 పంచాయతీల పరిధిలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 62 మంది వలంటీర్లను నియమించినట్టు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు చెప్పారు. నెలకు రూ.400 గౌరవ వేతనంపై వీవోఏ లీడర్లు మూడు నెలలు పనిచేస్తారన్నారు.